దెయ్యం పట్టిన మనిషి!

—కంచర్ల రమణ

నేను బజార్నుంచి వచ్చేసరికి, అమ్మా, నాన్న, చెల్లి ముందరగదిలో కూచుని ఏదో తీవ్రంగా చర్చించుకుంటున్నారు. వాళ్ళ మొహాలమీది భావముద్ర ప్రకారం వాళ్ళు మాట్లాడుకుంటున్నది సాధారణ విషయం కాదని నాకు బోధపడింది. ఏమిటా విషయం?

"యేమిటి నాన్నా? యేమిటంత గట్టిగా వాదించుకుంటున్నారు!" అన్నాను నాన్నను చూసి.

"యేమిటా?" అని ఆగి ఒక్కక్షణం నా మొహంలోకి తీక్షణంగా చూసి "మీ ముదుల మామయ్య నిన్ను అర్జంటుగా పంపమని ఉత్తరం రాసాడు" అన్నాడు నాన్న.

"ఎందుకుట ?" అడిగాను మామ్మూలుగా.

"ఎందుకా ?" అని నాన్న సమాధానం చెప్పబోతుంటే, మధ్యలో కల్పించుకుని "ఇప్పుడు తనకు అవసరం వచ్చింది కాబట్టి" అంది చెల్లి రోషంగా.

"ఏమిటో ఆ అవుసరం ?" అంటూ నా చేతిలోని కూరలసంచి అమ్మకు అందించాను.

సంచి అందుకుని, వంట చెయ్యటానికి ఇంట్లోకి వెళ్ళుతూ" యేముందిరా నాయనా ! ఎలాకావలిస్తే అలా మాట్లాడుకోవడానికి దేవుడు మనకో దుమ్ములేని నాలికిచ్చాడు గదా ! యేమైనా అనుకోవచ్చు" అంది అమ్మ.

"ఇంతకూ యేమయిందమ్మా ?" అన్నాడు అమ్మను అనుసరిస్తూ.

"మనతో అవసరం పడి పిలిస్తే, అవసరం కలిగింది కాబట్టి పిలిచారంటాం. పిలవకపోతే, మమ్మల్ని దూరపు బంధువుల్లా చూస్తున్నారు చూసారా, అవసరం కలిగినా పిలవలేదంటాం," అంది అమ్మ ముక్కు ఎగపీలుస్తూ.

"అబ్బబ్బ! అసలువిషయం చెప్పకుండా ఎందుకమ్మా యీ రాద్ధాంతమంతా !" అన్నాను చిరాగ్గా.

"నన్నడక్కు. పోయి మీ నాన్నగారినే అడుగు. ఈ యింట్లో నామాటకో విలువ ఉందిగనుకనా యేనా దయినా !" అని అమ్మ మూతి బిగించేసింది.

ఆమె తీరుచూసి యిహ ఆమెనుంచి యే భోగట్టా రాబట్టలేననుకుని, మళ్ళా ముందరగదిలోకి వచ్చాను.

"నాన్నా ! మామయ్య ఉత్తరంలో యేమిటిరాశాడు?" అన్నాను నాన్నను చూసి.

"నేను వేరేచెప్పడందేనికి ? నువ్వే చదువుకో" అంటూ

ఓ ఇన్‌లాండు కవరు నావైపు గిరవాటేశాడు నాన్న.

ఉత్తరం గాలిలో గింగిరాలు కొట్టి, నాకు నాలుగడుగుల దూరంలో పడింది.

వంగి ఉత్తరాన్ని అందుకుని, విప్పాను చదవడానికి.

అక్షరాల్ని చూడగానే అది మామయ్యరాసిన ఉత్తరం కాదనిపించింది. నా చూపులు అప్రయత్నంగా సంతకం వద్దకు పరుగెత్తాయి.

కాని గజపతిమామయ్య సంతకానికి అక్కడున్న సంతకానికి దగ్గరపోలిక ఉన్నాయి. కాస్త గజిబిజిగా, ఎగుడుదిగుళ్ళెక్కువగా ఉన్నా, అది గజపతిమామయ్య సంతకమే! సందేహం లేదు.

దస్తూరీ బట్టి దాని వెనకనున్న వ్యక్తియొక్క స్వభావాన్ని నిర్ణయించవచ్చునన్న విషయం నిజమో కాదో నాకు తెలీదుగాని, ఎప్పుడూ గుండ్రని ముత్యాల్లాంటి అక్షరాల్లో ఉత్తరం రాసే మామయ్య వంకరటింకరగా, వరుసావాడీ లేకుండా రాసేడంటే, మామయ్యనేదో భయాందోళనలు బాధిస్తున్నాయని అర్థంచేసుకోవడానికి నేను పెద్ద కష్టపడలేదు.

మామయ్యకొచ్చిన కష్టమేమిటి?

ఉత్తరం చదవనారంభించాను.

అనవాయితీగా జరిగే పలకరింపుల తర్వాత గజపతి మామయ్య రాసినదిది!

"మిమ్మల్ని నాకు చాలాదూరంగా ఉంచానన్నవిషయం నాకు తెలుసు. నేను ఆర్థికంగా ఎంతో ఉన్నతస్థితిలో ఉన్నా, మీకు సాయం చెయ్యలేదన్న సంగతి కూడా నాకు తెలుసు. అదంతా గతం. మర్చిపోండి. నాకిప్పుడు

మీ సాయంకావాలి. చెయ్యండి అందుకుతగిన ప్రతిఫలం తప్పక చూపిస్తాను.

సాయం అంటే యేమిటో అనుకునేరు. మీ సీతాపతిని కొన్నాళ్ళపాటు నాతో వుంచడమే ;

మా చెల్లెలుకు నేనంటే జాలి, అభిమానం ఉన్నాయి. అయితే అమెమాటకు మీరు విలువయివ్వరు. అంచేత యీ ఉత్తరం సీతాపతికి చూపండి. వాడికికూడా నాకు సాయం చెయ్యేడం యిష్టంలేదనిపిస్తే, ఆ సంగతి నాకు తెలియ జేయండి. నాకు అదృష్టం లేదనుకుంటాను

సీతాపతి రాకకోసం యెంతో ఆశగా యెదురుచూస్తు న్నాను. వాడ్ని తప్పక పంపుతారు కదూ !"

ఉత్తరాన్ని మడిచేసి తిరిగి నాన్నకు అందించాను

ఉత్తరం అందుకుంటూ అడిగాడు నాన్న "యేం? వెళ్తావా ?" అని.

"వెళ్తాను. యేం ?" అన్నాను.

మొహంమీద ఆశ్చర్యముద్రతో అలాగ ఉండిపో యాడు నాన్న కాసేపు.

"మరీ అంత ఆశ్చర్యపోవాల్సిందేమీలేదు. నాకిప్పుడు ఉద్యోగం సద్యోగం లేదు. తీరిగ్గా యిక్కడ కూచుని నేను చేసేదేముంది ? ఆ కూచునేదేదో వెళ్ళి మామయ్యా యింట్లోనే కూచుంటాను." అన్నాను క్షణంపోయాక మళ్ళీ నేనే.

నాన్న యేదో అనాలని ప్రయత్నించాడు. కాని, నేనో సారి ఏదైనా నిర్ణయం తీసుకుంటే మార్చుకోనన్న విషయం గుర్తొచ్చినట్టుంది.

"నీ యిష్టమొచ్చినట్టు తగలడు" నాన్న చీదరించు

కున్నాడు.

ఇంచుమించు అలాంటిమాటలే చెప్పి, చెల్లికూడా నన్ను మామయ్య వద్దకు వెళ్ళడానికి తీసుకున్న నిర్ణయాన్ని గట్టిపరిచింది.

గజపతిమామయ్యకు ఖరీదైన సరదాలుండేవి. అయితే ఆ సరదాలు తీర్చుకోవడానికి అవసరమయ్యే డబ్బు ఉండేదికాదు. తను సుఖపడాలంటే, తన సరదాలు తీరాలంటే, ముందుగా డబ్బు సంపాదించాలనుకున్నాడు.

డబ్బు సంపాదించడం కోసం మామయ్య చెయ్యని వ్యాపారమంటూలేదు. అవలంబించని వృత్తంటూలేదు. అయితే, యేవృత్తిలోనయినా, ఋజుమార్గాన పోయిన వాడికి నష్టం ఖాయం యీరోజుల్లో అన్నవిషయం తెలీదు మామయ్యకు.

ఫలితంగా, మామయ్య యే వ్యాపారంలోనూ రాణించ లేదు. అతడనుకొన్న డబ్బు సంపాయించలేదు. అతడి సరదాలు అలాగే ఉండిపోయాయి తీరకుండా.

అలాంటి సమయంలోనే మామయ్య రాజ్యలక్ష్మి అత్తయ్యను కలుసుకొన్నాడు. అప్పటికి రాజ్యలక్ష్మి అత్తయ్య భర్త చచ్చిపోయి, కొన్ని లక్షల ఆస్తి, ఒక అందాల బొమ్మలాంటి కూతుర్ని వెనక్కి వదిలిపోయాడు.

గజపతిమామయ్య పొడుగ్గా, యెర్రగా కండలుదిరిగి సినిమాయాక్టర్‌లా ఉంటాడు. అతడి అందం చూసి రాజ్యలక్ష్మిఅత్తయ్యే మురిసిపోయి, గజపతిమామయ్యను తనను పెళ్ళిచేసుకోమని కోరిందో, లేక అతడే ఆమెవద్ద చేరి, ఆస్తికోసం ఆమెను లొంగదీసుకొన్నాడో తెలియదు గాని, నలభై అయిదేళ్ళవరకు పెళ్ళి పెటాకులు తలవని

గజపతిమామయ్య పెళ్ళి చేసుకొన్నాడు రాజ్యలక్ష్మి అత్తయ్యను.

గజపతిమామయ్య రాజ్యలక్ష్మి అత్తయ్యను చేసుకోవడంతో అతని సమస్యలన్నీ తీరిపోయి ఉండాలి.

లక్షలకు అధికారి అయ్యాక తన సరదాలన్నీ తీర్చుకుంటూ వుండాలి.

మామయ్య, అత్తయ్య ఎంతో అన్యోన్యంగా ఉండేవారంటారు చూసినవారంతా. యేమయ్యిందో యేమోగాని గతించిన నెలలో రాజ్యలక్ష్మి అత్తయ్యకు జబ్బుచేసింది. మంచంమీద వారం రోజులుండి చనిపోయింది.

డబ్బొచ్చాక మామయ్య మమ్మల్ని దూరంగా వుంచాడేమో, అత్తయ్య చనిపోయిందని తెలిసినా మేమెవ్వరం మామయ్య యింటికి వెళ్ళలేదు. మామయ్యకూడా మమల్ని రాలేదేం అనిగాని, రమ్మనిగాని అనలేదు.

అదే యీనాటికీ, మానాన్న మనసులో నాటుకుని ఉండిపోయి యిప్పుడు నన్ను రమ్మని మామయ్య ఉత్తరం రాస్తే, అంత మండిపోయాడు నాన్న.

పెంకులు రాలిపోతున్న పాత పెంకుటింట్లో నివాసం, పచ్చడిమెతుకుల తిండితో విసిగెత్తి పోయున్నానేమో, మామయ్యలాంటి ధనవంతులు గడిపే జీవితం యెలాగుంటుందో చవిచూడాలని ఎంతో కుతూహలంగా వుంది లోలోన నాకు.

మామయ్య మా కుటుంబంపైన యింతకు ముందు చూపిన నిర్లక్ష్య భావాన్ని అందుకే ప్రక్కకు నెట్టి, విశాఖపట్నం బయలుదేరాను మామయ్య దగ్గరకు.

2

నేను యెక్కిన టాక్సీ సముద్రతీరాన్నానుకుని పరుగులు తీసే తారు రోడుమీద చాలాసేపు ప్రయాణంచేసి ఆగింది ఓచోట.

"దీన్నే సిల్వర్ బీచ్ అంటారు. దిగండిసార్!" అన్నాడు టాక్సీవాడు. టాక్సీదిగి ఫేరిచ్చి పంపేశాను.

సిల్వర్‌బీచ్‌కి యెదురుగా దిబ్బలమీదున్న బంగ్లాల్లో కల్లా అందమైనది, పెద్దదీ, మామయ్యఉంటున్న బంగ్లా. దానిపేరు "ప్రేమనికుంజ్"

ముందరున్న గేటుతీసి లోనికెళ్ళగానే, అందమైన పూలతోట, మధ్యలో రెండంస్తుల యెర్రమేడఉంది. ఆకాశంలోకి నిటారుగా, హుందాగాలేచి.

లోనికడుగెట్టగానే తోటమాలి యెదురొచ్చి "ఎవరు కావాలిబాబూ?" అన్నాడు వినయంగా.

మామయ్యపేరు, నాకు అతనితోటి ఉన్న బంధుత్వం చెప్పగానే, తోటమాలి మొహం ఆనందంతో విప్పారింది.

"రండిబాబూ! రండి. మీ కోసమే చూస్తున్నారు ఎప్పుడొస్తారా అని" అని నన్ను లోనికి తీసుకెళ్ళాడు తోటమాలి.

మామయ్య వరండాలో వాలుకుర్చీలో పడుకుని ఉన్నాడు. అతన్ని చూస్తూనే నివ్వెరపోయాను.

అతడు నేనెరిగిన మామయ్యకాదు. పొడుగ్గా, యెర్రగా వస్తాదులా, తనునడచే భూమికి రాజునన్నట్లుగా ఉండే మామయ్యకూ, నిస్తేజంగా, నల్లబడిపోయి దేనికో జడిసి కుర్చీలో నిస్సహాయుడిలా పడిఉన్న మామయ్యకూ యెక్కడా పోలికేలేదు.

మామయ్య రాతనుబట్టి, మామయ్య మానసిక స్థితిని నేను సరిగ్గానే అంచనా వేసానన్నమాట! అనుకున్నాను మనసులో.

"బాబూ! మీ మేనల్లుడుగారు వచ్చారు బాబూ!" తోటమాలి మృదువుగా, మెల్లగా అన్నాడు.

మామయ్య కళ్ళుతెరచాడు తక్షణం.

ఎదురుగా నిలుచున్ననన్ను చూసి "వచ్చావుట్రా సీతాపతీ! ఇంకనాకు ఫరవాలేదు" అంటూ బరువుగా నిట్టూర్చాడు.

అతడి గుండెలమీద అంతవరకూ ఉన్న భారమేదో దిగిపోయినట్టుగా అతని మొహంలో రిలీఫ్ కనిపించింది.

నా రాకవల్ల మామయ్యకంత ఆనందం కలిగినందుకు నాకెంతో సతోషమైంది

మామయ్యకు దగ్గరగా ఓ స్టూలు లాక్కొని కూచుని "యేం మామయ్యా! అలాగయిపోయావేం?" అన్నాను.

"ఎలాగయిపోయాను?......యేం నాలో మార్పు అంత కొట్టొచ్చినటు అవుపిస్తోందా?" అడిగాడు మామయ్య మందంగానవ్వి.

"అని అడుగుతున్నావా? సింహం అమాంతంగా లేడి పిల్లగా అయిపోయినట్టు అనిపిస్తున్నావు ఇంతకూ సంగతేమిటి?"

మామయ్య నాప్రశ్నకు వెంటనే జవాబివ్వలేదు. కాసేపు నా మొహంలోకి, కాసేపు వేరే దిక్కుకిచూసి రెండుమూడు నిముషాల తర్వాత "మీ అత్తయ్యపోయాక, ఏమిటో ఒంటరితనం భరించరానంత ఎక్కువై పోయి నట్లు అన్పిస్తోంది. అందుకే నిన్ను రమ్మన్నాను."

అన్నాడు మెల్లిగా.

అతని జవాబు నాకు చాలా అసంతృప్తిగా ఉంది.

"అదేమిటి మామయ్యా. నీకు తోడుకావాలంటే తోట మాలీ లేడూ?......అయినా మాయ ఉంటోందిగా నీతో.. అంతగా కావలిస్తే, నాలుగు రోజులు వంటావిడ్ని రాత్రుళ్ళు ఉండమంటే ఉండిపోదా?......మరీ అంత బోరనిపిస్తే, ఊళ్ళో హోటల్లో ఉండొచ్చుగదా?" అన్నాను.

మామయ్య నాకు జవాబివ్వకుండా రెండునిముషాలు నా కళ్ళల్లోకి నిరాశగా, దీనంగా చూసి "ఇక్కడనాతో ఉండడానికి నీకేమన్నా అభ్యంతర ముందా?" అన్నాడు.

"అబ్బే లేదుమామయ్యా! అందుకేగా వచ్చింది" అన్నాను.

"చూడు అప్పన్నా! సీతాపతికి మేడమీద గదిలో మకాం యేర్పాటుచెయ్యి!" అన్నాడు మామయ్య తోట మాలిని చూసి.

"అలాగేనండి" అనిచెప్పి తోటమాలి అప్పన్న నన్ను మేడ మీదకు తీసుకెళ్ళాడు.

నాకివ్వబడిన గది విశాలంగా సదుపాయంగా ఉంది. గదికి మధ్యగా ఫోం బెడ్‌తోఉన్న మంచం ఉంది. ఓ మూలగా ఒక టేబిలు, కుర్చీ, మూడు స్టూల్స్, ఒక టీపాయ్ ఉన్నాయి.

చాలా రోజుల తర్వాత ఆ గది నా కోసం తెరచి, శుభ్రం చేసి యిచ్చినట్టున్నారు. చిన్నగా ముక్కు వాసన వేస్తోంది. గదికి ఉన్న ఒకేఒక్క పెద్దకిటికీ తెరచాను. దుర్వాసన తరిమేయడానికి.

కిటికీ, యింటి వెనుక తోటవైపుకుంది. దాన్ని తెరి

రాక, తోటలోకి ఓసారి చూసాను. తోటలో ఓ అమ్మాయి పద్దెనిమిదేళ్ళ ప్రాయమున్నది, కుక్కతో ఆడుకుంటోంది.

ఆమే మాయ! మామయ్య గురించిన ఆలోచనల్లో మాయగురించి మర్చిపోయాను. మాయ, రాజ్యలక్ష్మి అత్తయ్యకు మొదటి భర్తవల్ల కలిగిన అమ్మాయి.

మామయ్య యింటికి ఇంతకుముందెన్నడూ రాక పోయినా, ఓ పిక్నిక్‌లో కలుసుకున్నాం మాయ, నేనూ కాకతాళీయంగా.

మాయ, నేనూ బాగా స్నేహితులమయ్యాం అప్పుడే.

"మాయా!" కేకేస్తూ చెయ్యి ఊపాను, మాయను రమ్మన్నట్టుగా.

"ఎవరూ?" అంటూ తలెత్తి చూసి, నన్ను గుర్తించి "నువ్వా! ఎంతసేపయింది వచ్చి?"

"వచ్చి పది నిముషాలయింది. వచ్చిన పెద్దమనుషుల్ని పలకరించడమంటూ ఉందా లేదా?" అన్నాడు నవ్వి.

మాయ కుక్కను పంపేసి, రెండునిముషాల్లో పరుగు పరుగున నా గదికి వచ్చింది.

పిక్నిక్‌లో చూసినప్పటికీ, యిప్పటికీ ఆమెలో మార్పు యేం వచ్చిందో అని నిశితంగా చూసాను మాయను.

మాయ అందగత్తెలకే అందగత్తె. గులాబీరంగు శరీర ఛ్ఛాయ, చక్రాల్లాంటి కళ్ళు, షుమారైన ఎత్తు, మగాడి లోని పురుషత్వాన్ని సవాలుచేసే బలిష్ఠమైన రొమ్ములు, అందాన్ని దేవుడ్నించి వరంగా పొందినట్టుగా అనిపిస్తుంది.

"యేంటలా చూస్తున్నావు నన్ను? వింతజంతువును

చూస్తున్నట్టుగా" అంది మాయ ఫక్కున నవ్వి.

"నువ్వుకూడా నన్ను అలాగే చూస్తున్నావుగాబట్టి" జవాబిచ్చాను తమాషాగా.

"నీలా నేను కొరికేస్తున్నట్టు చూడ్డంలేదులే. క్రితం సారికీ యిప్పటికీ యేం మారానో అని చూస్తున్నానంతే!" అంది మూతి వంకరలు తిప్పి.

"మారానా?... చూసి చెప్పు" అంటూ చుబుకం బాగా పైకెత్తి నిటారుగా నిలుచున్నాను.

నా చుట్టూ రెండుసార్లు తిరిగి "కసరత్తుచేస్తున్నట్లు న్నావు కండలు తిరిగివుంది శరీరం. బీరుతాగడం బాగా యెక్కువైనట్టుంది, బుగ్గలు బాగా నునుపెక్కాయి" అంది, పెదవుల మధ్య నవ్వును నొక్కిపడ్తూ.

"తగ్గు! తగ్గు! బీరు కాదుగదా యింటిదగ్గర నీరు తాగడమే కష్టంగా వుంది... ఇంతకూ మామయ్య నన్నెందుకు పిలిపించినట్టు? నీకేమైనా తెలుసునా?" అడిగాను మాయను. అమైనా నా అనుమానం నివృత్తిచేస్తుందని.

"నీకు నన్ను కట్టిపెట్టడానికిమాత్రం కాదులే. కంగారు పడకు".

"ఛ! ఛ! అంత దురాశలేదు నాకు" అన్నాను నవ్వి.

"అయితే బాగుపడతావ్! ఫో!... మీ మామయ్యకు ఏదో కాంప్లెక్సు పట్టుకుంది యీ మధ్యనే. తన నీడను చూసి తనే జడుసుకుంటాడు. కిటికీలు చప్పుడయినా, గాలి గట్టిగా వీచినా, ఆఖరుకు పిల్లి మైలుదూరంలో ఉండి మ్యావ్‌మన్నా, యిక్కడ ఉలిక్కిపడతాడు."

"ఇదంతా యెప్పటినుంచి?"

"ఇంచుమించు మా అమ్మ చచ్చిపోయిననాటినుంచి

అనుకో."

"కారణమేమిటో నీకు చెప్పలేదా?"

"ఆయనకు తెలిస్తేగదా చెప్పడానికి!"

"అతనికి కూడా తెలియకుండా యెలావుంటుంది?"

"లేకపోతే మనకు చెప్పివుండేవాడుగా. మనం యేదో చేసి అతని భయం పోగొట్టేవాళ్ళంగదా!"

"ఆల్ రైట్! నేను యిక్కడకు రావడం నీకు యిష్టమేనా?" ఊరికినే అలా అన్నాను, యేమంటుందో చూద్దామని.

"ఇష్టమని అడుగుతున్నావా?... నువ్వు రావాలని దేవుణ్ని ప్రార్థిస్తున్నాననుకో... మీ మామయ్య అలా అయిపోయారు. ఇంక యీ దిక్కుమాలిన యింట్లో ఒక్కర్తినే బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నాను."

"ఇంక నీకు కాలక్షేపానికి కరువుండదులే. అభయం యిస్తున్నాను. నిశ్చింతగా ఉండు" అన్నాను నాటకం ఫక్కీలో అభయముద్ర పట్టి.

మాయ ఉప్పెనగా నవ్వి "సామాన్లు అన్నీ సర్దుకుని విశ్రాంతితీసుకో. నీకు కాఫీ టిఫిను పంపిస్తాను," అంటూ అక్కడనుంచి దిగువకు తుర్రుమంది.

ఆ తరువాత నా సామానులు సంచుల్లోంచి బైటికితీసి గదిలో సర్దడంలో మునిగిపోయాను.

3

రాత్రి పదిన్నర కావస్తోంది. అంతవరకూ బెడ్‌లైటు వెలుగులో ఓ క్రైం నవల సగం చదివి, యిహ ఆట్టే చదివే ఓపికలేక లైటు ఆర్పేసాను.

మెత్తని సిల్కులాంటి చీకటి గదంతా పరచుకుంది.

తెరచి ఉన్న కిటికీల్లోంచి తెరలుతెరలుగా లోనికి వస్తున్న గాలి ఒంటికి చల్లగా తగిలి హాయి కలిగిస్తోంది.

నా చూపులు యధాలాపంగా కిటికీ దాటి వెలుపలికి పరుగెత్తాయి. బయట తోటలో వెన్నెల మందంగా కురుస్తోంది.

అప్రయత్నంగా నా మనస్సు నిన్నటికీ, యివాల్టికీ నా జీవితంలో వచ్చిన మార్పును బేరీజు వేసింది.

నిన్న మా వూర్లో, పీధరుగుమీద, ఓ తుంగచాపమీద పల్చని దుప్పటి పరుచుకొని, రద్దుగద్దల తలగడ తల క్రింద పెట్టుకుని భవిష్యత్తునుగురించి యేవో కలలు గంటూ పడున్నాను. ఇవాళ యిక్కడ, మెత్తని ఫోం బెడ్‌మీద దొర్లుతూ సుఖం అంటే యేమిటో రుచిచూస్తున్నాను మొదటిసారిగా.

హుఁ... యెన్నాళ్ళుగే యీ సుఖం? మహాఅయితే నెల లేదా రెండు నెలలు.

ఆ తరువాత మళ్ళా, నా తుంగచాప, రద్దుగుద్దల తలగడమీద పడక ఉండనే వుంది.

గదిలోని నిశ్శబ్దాన్ని చీలుస్తూ వినవస్తోంది సముద్రపు హోరు.

ఎవరో జోలపాడుతూ, ఉయ్యాలూపుతున్నట్టుగా ఉంది, లయాన్వితంగా వినబడుతున్న హోరు వింటుంటే.

నిద్ర మెలమెల్లగా మృదువుగా నా కనురెప్పలమీద పువ్వులు అద్దినట్టుగా నన్ను ఆక్రమించుకోవడం మొదలు పెట్టింది.

నేను చిక్కని చీకటి కెరటాలమీద తేలిపోతున్నట్టు, మెత్తని దూదిపింజలు లోయలోకి జారిపోతున్నట్టు అని

పించసాగింది.

ఎంతో...ఎంతో...హాయిగా ఉంది! చాలా సుఖంగా వుంది!

ఎప్పుడూ యింత మత్తుగా నిద్ర రాలేదు.

అవును! యెప్పుడూ రాలేదు! యెప్పుడూ రాలేదు!

"అమ్మో!... చచ్చిపోయాను! బాబోయ్ చచ్చిపోయాను!"

ప్రశాంత వాతావరణాన్ని ఛిన్నాభిన్నం చేస్తూ మామయ్య వెర్రికేక.

క్షణంలో నా నిద్ర తుళ్ళిపోవడం; టేబిలులైటు వేస్తూనే మామయ్యవద్దకు పరుగెత్తడం జరిగింది.

"యేమైంది మామయ్యా? యేమైంది మామయ్యా?"

ఒళ్ళంతా చెమట్లుపోసి, యెండుకొమ్మను వేల్లాడుతున్న యెండుటాకులా వణికిపోతున్న మామయ్యను గట్టిగా పట్టుకుని కుదుపుతూ అడిగాను.

మామయ్యకు నా మాటలు విన్పడ్డాయో, లేదో తెలీదుగాని, అతని దృష్టి నావైపుకు మళ్ళలేదు. ఇంకా ఆ భ్రాంతి లోకంలోనే ఉన్నాడు.

"అమ్మో! చచ్చిపోయాను......బాబోయ్ చచ్చిపోయాను..." సీలింగు వైపు చూస్తూ అరుస్తున్నాడు మామయ్య.

మామయ్యకు భయంకరమైన పీడకలేదో వచ్చింది. కల ప్రభావం నుంచి యింకా ఆయన విడివడలేదు.

మామయ్యను మళ్ళా గట్టిగా కుదిపి వూపుతూ 'యేం జరిగింది మామయ్యా" యేం చూసావు కలలో? యెవరు నిన్ను చంపాలని చూస్తున్నారు? అన్నాను

బిగ్గరగా.

నా మాటలు అతని మనస్సును చొచ్చుకున్నట్టున్నాయి నా కళ్ళల్లోకి చూసాడు. నన్ను గుర్తించిన చూపు వచ్చింది అతని కళ్ళలోకి.

"కలగాదురా ఆది నిజంగానే చూసాను. ఒక తెల్లని ఆకారం, చేతిలో బారుకత్తి పుచ్చుకుని నా కంఠంలో దిగవెయ్యడానికి మీదకు ఊరకటోయింది. నేను భయంతో కేక పెట్టగానే ఆగిపోయింది....ఇప్పుడా రూపం అదృశ్యమైంది" చెప్పాడు మామయ్య, భయంతో దుఃఖంతో వణుకుతున్న కంఠంతో.

'ఇదేనా మొదటి సారి యిలా అవడం? ఇంతకు ముందెప్పుడయినా యిలా జరిగిందా?' అడిగాను కుతూహలంగా.

"చాలా రోజుల బట్టి ఏదో అదృశ్య రూపం నన్ను వెన్నాడుతున్నట్టునిపిస్తోంది. నేను గదిలో ఒంటరిగా వుంటే, నా వెనుగ్గా ఎవరివో అడుగుల చప్పుళ్ళు వినిపడతాయి. కిటికీకి దగ్గరగా గాలి కోసం కూచుంటానా, ఎవరో కిటికీలోంచి గదిలోకి దూకి వచ్చినట్లు గాలి రివ్వుమంటుంది. అర్ధరాత్రప్పుడు గదిలో పడుకున్న నాకు, నా చెవికి దగ్గర్లో ఎవరో రహస్యమంతనాలు సాగిస్తున్నట్లు అస్పష్టంగా గుస గుసలు వినివిస్తున్నాయి. మామయ్య ఆగాడు ఊపిరి పీల్చుకోడానికి.

'ఇవన్నీ యెందుకు జరుగుతున్నాయో నీకేమన్నా అయిడియా ఉందా?' మామయ్య కళ్ళల్లోకి లోతుగా చూస్తూ అన్నాను.

'యేమోరా నాకూ తెలీదు' అన్నాడు మామయ్య

గట్టిగా నిట్టూర్చి, కళ్ళు మూసుకుని నిద్రపోవడానికి ప్రయత్నిస్తూ.

ఇలాంటి పరిస్థితుల్లో మామయ్యకేం సాయం చెయగల్ను? నా మనస్సు ఆవేదనా భరితమైంది.

వెనక్కి పోయి పడుకోవాలనుకున్నాను. లేవబోయాను మామయ్య చట్టున కళ్ళువిప్పి 'వెళ్ళిపోకురా సీతాపతి! సుఖంగా నిద్రపోయి ఎన్నాళ్ళయిందో నాకు. నువ్వు నాతో కూడా ఉంటే ఆ దెయ్యం కనిపించదు' అన్నాడు.

తెల్లవార్లూ మామయ్య మంచం ప్రక్కనే, అతని మొహంలోకి చూస్తూ, అతనికి కాపలా కాస్తూ కూచున్నాను.

4

దెయ్యాల్ని, భూతాల్ని, సిదల్ని, గాలుల్ని, చూసి జడుసుకునే రకంకాదు మామయ్య. ఆ విషయం నాకు బాగా తెలుసు.

అయితే, పులిలా తిరిగిన మామయ్య పిల్లిలా ఎలా మారిపోయాడు?

ఉదయం పదకొండు కావస్తుండగా, మామయ్య కార్లో ఊర్లోకి వెళ్ళాడు ఏదో పనిమీద. ఇహ ఆలంకంత కోపంలో ఉన్నది, తోటమాలి అప్పన్న, వంటావిడ వెంకటమ్మ, మాయ.

మామయ్య ప్రస్తుతం ఉన్న పరిస్థితికి కారణం వారికేమైనా తెలుస్తుందేమో కనుక్కోవాలనిపించింది.

ముందుగా, మాయను అడగాలనుకున్నాను మామయ్య గురించి. మాయ గదికి పోయి చూసాను ఆమె అక్కడలేదు. వంటావిడను అడిగాను, మాయా

యెక్కడుంటుందో చెప్పమని.

"ఆమెకు యెప్పుడు తోచకపోయినా బీచికి పోయి తిరుగుతుంది." చెప్పింది వంటావిడ.

బంగ్లా వెలుపలికి వచ్చి, రోడ్డుదాటి, బీచికి వచ్చాను. అలా సముద్రపు అంచున కొంత నీళ్ళల్లోనూ, కొంత యిసుక మీద నడుచుకుంటూ బయలు దేరాను.

ఆ ప్రాంతంలో బీచి ఎంతో అందంగా, శుభ్రంగానూ ఉంది సాధారణంగా ఆ ప్రక్క బీచికి వచ్చే మనుషులు బహుతక్కువ.

బహుశః మాయ అగపడకపోయినా నా శ్రమ వృధా కాదనిపిస్తోంది. నీలాకాశం క్రింద, అంతకన్నా నీలంగా ఉన్న సముద్రపు అంచున నడుస్తుంటే.

సముద్ర వొడ్డున ఉన్న యే యిసుక దిబ్బల మధ్యో మాయ కూచుని ఉంటుంది. అందుకే, ఆమె నా దృష్టిలో పడలేదు. తీరం అంచుకంటా నా చూపు సారించినా.

ఇంచు మించు అరమైలు దూరం వెళ్ళాను. ఇంకా నడవాలనే ఉంది విసుగనిపించలేదు.

అలా ముందుకు సాగిపోతుంటే, "సీతాపతీ! ఇలారా! అంటూ పిలిచింది మాయ ఏవోపిచ్చి మొక్కల మధ్య నుంచి. చప్పున అటు తిరిగి 'నువ్విక్కడున్నావా? నీ కోసమే వచ్చాను" అన్నాను ఆమె వైపు కదిలి.

'ఇలారా! ఇక్కడ నీడగా వుంది. బావుంటుంది. కూర్చోవడానికి' అంటూ పిలిచింది నన్ను.

నేను పోయి ఆమె ప్రక్కనే ఇసుకలో కూలబడ్డాను. మాయ చెప్పినట్టుగానే ఆ చోటు చల్లగా హాయిగా ఉంది.

'తరచుగా ఇక్కడికొస్తుంటావా?' అన్నాను యిసక

లో నేలితో యేవో పిచ్చి గీతలు గీస్తూ.

వస్తూనే మామయ్య గురించి అడగడం బావుండదని పించింది.

"చాలా తరుచుగా, బోరు కొట్టినపుడల్లా, అమ్మ జ్ఞాపకం వచ్చినప్పుడల్లా వస్తుంటాను.' చెప్పింది మాయ.

"పెళ్ళి చేసుకో గూడదు. బోరు అంతా యెగిరి పోతుంది." అన్నాడు, ఆమెకళ్ళల్లోకి గాకుండా, ఉవ్వెత్తుగా లేచివచ్చి ఒడ్డున విరిగి పడ్తున్న నీలి కెర టాల వైపు చూస్తూ.

"పెళ్ళా"......యీ జన్మలో చేసుకోను' టక్కున వచ్చింది. ఆమె నుంచి సమాధానం.

ఆమె తమాషాగా అందేమోనని ఆమె మొహంలోకి చూసాను. కాని సీరియస్‌గా ఉందామె మొహం.

'ఎందుకో ఆ వైరాగ్యం" కారణం తెలుసుకోవచ్చునా నవ్వుతూ అన్నాడు.

'సంసారం సుఖంగా సాగాలంటే డబ్బు అవసరం. కాని మితిమీరిన డబ్బు సంసారానికి శాపంగాను, భార్యా భర్తల అన్యోన్యతకు విషంగాను మారుతుంది.."

'పోనీ నా లాంటివాడ్ని, డబ్బులేని వాడ్ని చేసుకో'

"కాని నాకు డబ్బుందిగా. అది నా తల తిప్పేస్తుంది. కొద్ది రోజుల్లో.'

"ఇంత వేదాంతం నీకెవరివల్ల అబ్బిందో కూడా చెబితే సంతోషిస్తాను."

"ఇంకెవరు? మా అమ్మ."

"మీ అమ్మకేం?"

"మా అమ్మ కడు పేద కుటుంబంలో పుట్టింది.

కానయితే, అందానికి, తెలివితేటలకు లోటులేదు. తనకు డబ్బులేకపోవడంవల్ల, డబ్బంటే ఒకవెర్రివాంఛ పెంచు కుంది.

డబ్బులేకపోవడంవల్ల, తనకెన్ని సుఖాలు అందకుండా పోతున్నాయో ఊహించుకుని, డబ్బుకోసం తపించిపో యింది. లక్షల డబ్బు మూల్గుతున్నవాడు, మూడో పెళ్ళికి సిద్ధంగాఉన్న వాడొకడు మా అమ్మను చూసాడు. అతడి డబ్బు చూడగానే అమ్మ మారు మాటాడకుండా పెళ్ళి చేసుకుంది.

తీరా పెళ్ళయ్యాక తెలియవచ్చిందేమంటే విపరీత స్త్రీలోలత్వంవల్ల ఆ మానవుడు తన పురుషత్వాన్ని ఏనాడో కర్చుపెట్టేసుకున్నాడు. అయితే తన వంశం నిలబెట్టుకోవడానికి ఆయనకో వంశాంకురం కావాలి. కాని ఆతనిలో వీర్యత్వం లేదు.

అమ్మ పరిస్థితి అర్థం చేసుకుంది. ఫలితంగా ఎవడో ఒక అనామకుడివల్ల నన్ను కన్నది.

అలా అలవాటుపడింది అమ్మ పురుషులకు. మా నాన్న గారు బ్రతికున్నంతకాలం ఆయన ఆమెకో రక్షక కవచం అయ్యారు. తీరా ఆయనపోయాక, ఆమె తిరుగుళ్ళకు కావలసిన రక్షణ లేకపోయింది. ఇటు తన వాంఛలు తీరడానికి, అటు రక్షణ యివ్వడానికి ఆమెకు ఒక మగ వాడు అవసరమొచ్చాడు. అప్పుడే మీ మామయ్య అవు పించాడు.

అమ్మ సంగతి పూర్తిగా తెలిసాక కూడా ఆయన అమ్మను పెళ్ళిచేసుకొన్నాడు. తెలిసికూడా ఎందుకు చేసుకొన్నాడో యీ నాటికీ నాకు అర్థంగాని శేషప్రశ్న.

అమ్మ దబ్బుచూసి ఆమెను చేసుకొన్నాడని నా అను మానం."

మొట్టమొదటి సారిగా మామయ్య కుటుంబ జీవితం గురించి చాలా విషయాలు తెలుసుకున్నాను. కాని అతడున్న ప్రస్తుత పరిస్థితికి అవసరమయ్యే క్లూ, అతని గతజీవిత విశేషాలు యివ్వలేకపోయాయి. మనస్సులో దిగులు ఆవరించసాగింది.

''మరి మీ అమ్మా, మామయ్య చాలా అన్యోన్యంగా ఉండేవారు కాదా ?" అన్నాను రెండు నిముషాలనంతరం.

"వాళ్ళమధ్య ద్వేషాలు లేకపోయినా, వాళ్ళిద్దరి మధ్య పెద్దగా ప్రేమలు పొంగిపొర్లి పోలేదని మాత్రం చెప్ప గలను."

"దాఖలా యేమిటి ?"

"ఎన్నోసార్లు మా అమ్మ ప్రేమగా మీ మామయ్యకు దగ్గరగా రాబోతే, కంపరం యెత్తినవాడిలా మీ మామయ్య మొహం పెట్టగా ఎన్నోసార్లు చూసాను."

"గతాన్ని తవ్వి యిప్పుడు ప్రయోజనం లేదు. నీ వుద్దేశంలో మామయ్య యిలా అయిపోవడానికి కారణం యేమిటి ?"

"నాకేం తెలీదు."

"యేదైనా ఉండొచ్చునేమోనని ఊహించనైనాలేదా?"

"అనవసరంగా తలబ్రద్దలు కొట్టుకోవడం యిష్టంలేక ఊరుకొన్నాను."

"మామయ్యంటే నీ కిష్టంలేదా ?... ఆయన నీపట్ల యెలాగుండేవాడు ?"

"చెప్పడం మర్చిపోయాను... ఆయనకు నేనంటే

ఎంతో ప్రేమ... నామాట కాదనడు."

"అలాంటి వ్యక్తిని పోగొట్టుకుంటే నీకెంత నష్టమో ఆలోచించావా ?"

"ఆలోచించాను. అయితే యేం లాభం? నేను చెయ్యగలిగిందేమీ లేదుగదా !''

"ఇహ వెళ్దాం పద." అంటూలేచాను. మాయకూడా లేచింది. ఆమె ప్రక్కన నడుస్తున్న నా కుడిచెయ్యి అప్రయత్నంగా ఆమె భుజంమీద పడింది. ఒక్క క్షణం ఆశ్చర్యంగా నా కళ్ళల్లోకి చూసింది, తలత్రిప్పి. తప్పు గ్రహించి చెయ్యి తీసేసుకోబోయాను. కాని, అప్పటికే ఆమె ఎడమ చెయ్యి నా నడుంను చుట్టేసింది. ఆమె తల నా భుజంమీద వాల్చి గాఢంగా నిట్టూర్చింది. నా చెయ్యి ఆమె భుజం మీంచి తీసేసుకోవాల్సిన అవసరం మరి కలగ లేదు

"నీకు చెడుపు, చిల్లంగి వగైరా మంత్ర ప్రయోగాల మీద నమ్మకముందా?" అడిగాను త్రోవలో.

"లేదు యేం?''

"మామయ్య మీద అలాంటి ప్రయోగమేదో జరిగిందని నా అనుమానం."

"ఆయనకు శత్రువు లెవరున్నారు అలా చెయ్యడానికి ?"

మాయ చెప్పిందాంట్లో పాయింట్ ఉంది. "చెప్పింది నిజమే" అన్నాను.

ఆ తరువాత మాకేం మాట్లాడుకోవాలో తోచలేదు. ఆమె స్పర్శను నేనూ, నా సాన్నిహిత్యాన్ని ఆమె మవునంగా ఆనందించడంతో మునిగిపోయాం.

ఇంటికి బాగా చేరువగావచ్చేశామన్న విషయం గూడా మర్చిపోయాం ఆ మైమరపులోబడి.

ఇల్లు, ఇంటి ముందరున్న కారుని చూడగానే. మాయ నేనూ విడిపోయాం.

తోటదాటి యింటికి సమీపించేసరికి. వరండాల్లో పచార్లుచేస్తున్న మామయ్య కనిపించేడు.

మాయను, నన్నూ చూడగానే "ఇంతసేపూ యెక్కడికెళ్ళార్రా మీరు?" ఆవేశంగా అరిచాడు మామయ్య.

మామయ్య తీరు నన్ను ఆశ్చర్యంలో ముంచింది.

"అంకుల్! అలా సముద్ర పొద్దున కూర్చుని వస్తున్నాం" జవాబిచ్చింది మాయ.

"కూర్చుని వస్తున్నారా? పడుకుని వస్తున్నారా?" మామయ్య మాటల్లో కసి ధ్వనించింది. కొరడా దెబ్బ తిన్నట్టు అదిరిపడ్డాను.

ఇద్దరు యువతీ యువకులు చనువుగా. స్నేహంగా ఉంటే, వారు తమ లైంగికావసరాలు తీర్చుకోవడానికే అలా ఉన్నారని అనుకోవాలా?.

అయినా ఆమె నా మామ కూతురు. వరుసవుతుంది. ఆమెను సెక్సుదృష్ట్యా చూడడానికి నాకు హక్కువుంది. అలాంటప్పుడు, మా స్నేహం మామయ్యతో ఆగ్రహాగ్ని రగిలించడానికి కారణం?.

"పెళ్ళి చేసుకోకుండా అలాంటి నీచపు పనులు చెయ్యాల్సిన అగత్యం నాకులేదు మామయ్యా" అన్నాను మృదువుగా, కాని దృఢంగా.

దాంతో మామయ్య ఆగ్రహావేశాలకు ఆనకట్టబడింది. "వెళ్ళండి! వెళ్ళండి! వంటామె మీకోసం చూస్తోంది

పోయి భోంచెయ్యండి," అన్నాడు మామయ్య; మళ్ళా పచార్లు చెయ్యడం ఆరంభిస్తూ.

మేం మెల్లగా యింట్లోకి ప్రవేశించాం.

5

మామయ్య ప్రవర్తన నన్ను ఆశ్చర్య చకితుణ్ని చేసింది. అయితే. ఆ వింత ప్రవర్తనకూ, ఆయన ప్రస్తుత మానసిక పరిస్థితికి క్లూ ఉన్నట్టనిపించింది నాకు.

ఓరోజున మామయ్య యింటలేని సమయంలో ఈ విషయం ప్రస్తావించాను మాయతో.

"నేనంటే మీ మామయ్యకు ప్రత్యేకాభిమానమని మొన్ననే చెప్పాను. బహుశా నేను చెడిపోతానన్న భయం వల్ల ఆయనకు కోపం కలిగి ఉంటుంది," అంది మాయ.

"నా విషయంలో గాకుండా యింకేమగాడి విషయంలో నయితే, నువ్వు చెప్పింది ఒప్పుకుంటాను. తన మంచిని కోరేవాణ్ని, తన మంచికోసం తాపత్రయపడేవాణ్ని అనే నమ్మకముండబట్టేగదా మామయ్య పిలిపించింది. అలాంటి వాడు యిలా ప్రవర్తిస్తున్నాడంటే ఆశ్చర్యంగా వుంది నాకు," అన్నాను.

"అయితే, యింతకూ యేమిటంటావ్?" అంది మాయ కాస్త చిరాగ్గా.

"ఓ మనిషిని ఆవేశపరుస్తే, ఆ మనిషిలో దాగున్న నిజమైన మనిషి బయటకొచ్చేస్తాడు ముసుగు తీసుకుని"

"అంటే" అంది మాయ ఆశ్చర్యంగా నొసలు చిట్లించి.

"యేంలేదు. మామయ్యకు ఎర్రెక్కిస్తే. అతని కాంప్లెక్సుకి కారణమేమిటో మనకు తెలియవచ్చు"

"అయితే. యేం చేద్దామంటావ్ ?"

"నాకో బ్రహ్మాండమైన ఆలోచన తట్టింది. నీ సహకారం కావాలి."

"చెప్పు. మంచిదయితే, తప్పక తోడ్పడతాను."

"మనిద్దరం స్నేహంగా, సన్నిహితంగా ఉండడం మామయ్యకెందుకో సరిపడ్డంలేదు. నిజానికి, మనమధ్య చనువు, స్నేహం యేర్పడి ఉండకపోతే, ప్రోత్సహించవలసిన వ్యక్తి ఆయన. ఈ బలహీనతను ఆసరాగా తీసుకుని అతనిని వేడెక్కించాలనుకుంటున్నాను"

"అయితే, నేనేం చెయ్యాలో చెప్పు వివరంగా"

"నేనంటే యిష్టంగా వున్నట్టు..."

"ఇష్టంలేకపోతే గదా!"

"నేను చెప్పేది పూర్తిగా విన్నాక అప్పుడు చెప్పు... నేనంటేనీకు...నువ్వంటే నాకు వెర్రివ్యామోహం...మనం పెళ్ళిచేసుకోకుండానే, విచ్చలవిడిగా తిరుగుతుంటాం..."

"నువ్వు చెప్పడం బాగానేఉంది గాని, నా భవిష్యత్తు యేమవుతుందో ఆలోచించావా ?"

"ఆలోచించాను...నావల్ల నీకు చెడ్డపేరుగాని వస్తే, పెళ్ళి చేసేసుకుంటాను నిన్ను"

"అంత బాధపెట్టనులే నిన్ను. చెప్పు."

"అతడి కళ్ళముందు మనం విచ్చలవిడిగా తిరుగుతున్నట్టు కనబడాలి"

"అలాగే. ఓకే" అంటూ తన అంగీకారం తెలియచేసింది మాయ.

అదిమొదలు మా అవతారాలు మారిపోయాయి. పచి శృంగారం కోసం పడిచచ్చే కాముకులంగా మారాం.

ప్రక్కగదిలో ఉన్న మామయ్యకు మా మాటలు విన్పడతాయంటే చాలు, మేం రహస్యంగా సాగించబోయే కామకలాపం గురించి మాట్లాడేవాళ్ళం.

అదే సమయంలో మేం ఉన్న గదిలోకి మామయ్య వస్తే, ఆయన రాక గమనించి, మేం మామూలుగా అవుపించాలని ప్రయత్నిస్తున్నట్టు అవుపించే వాళ్ళం.

రాత్రుళ్ళప్పుడు మామయ్య మా గదుల్లోకి వచ్చేవాడు. ఊర్లోకి వెళ్ళి సాయంకాలం వరకు రానని చెప్పిపోయి, వెళ్ళిన అరగంటలో తిరిగొచ్చేసేవాడు ఒక్కోసారి బీచికి మేం యిద్దరం షికారుకు వెళ్ళితే, అక్కడ రహస్యంగా, యిసుకదిబ్బల మధ్య యేం తంటాలు పడుతున్నామో అని మా వెనకాలేవచ్చి చూసి వెళ్ళిపోయేవాడు.

మాయకూ నాకూ మధ్య రహస్యకామకలాపం సాగుతోందనీ, అయితే అతని కళ్ళబడకుండా మేం తెలివిగా తప్పించుకుంటున్నామన్న ఆలోచన మామయ్య మనస్సులోకి బాగా పాతుకుపోయేలా చేశాను. నా పథకం ప్రకారం ఇహ ఆఖరి డోస్ యివ్వడమే మిగిలిపోయింది.

ఆవాళ సాయంకాలం అయిదున్నర అవుతుండగా, తాను పట్నం వెళుతున్నాననీ, మర్నాటి ఉదయంవరకూ రాననీ నన్నుపిల్చి చెప్పాడు.

కాని, నాకు తెలుసు, ఏదో సాకుచెప్పి, అరగంటలో మామయ్య వెనక్కు వస్తాడు.

ఆవాళ మామయ్య తిరిగొచ్చేసరికి నేనేం చేస్తున్నట్లు కనిపించేదీ మాయకు చెప్పాను. ఆమె తన అంగీకారం వెంటనే తెలియచేసింది.

కావాలనే వీధిగేటు, దిగువనున్న గదుల తలుపులు

తాళాలు వెయ్యకుండా వదిలేశాం.

సరిగ్గా అరగంట గడిచాక, రోడ్డుమీద కనిపించిన హెడ్‌లైట్ల కాంతినిబట్టి, మామయ్య తిరిగి వచ్చేస్తున్నాడని అనుకున్నాము. మా బంగ్లాముందు కారు ఆగడం బట్టి, అది మామయ్యకారని నిర్ధారి చుకుని, క్షణం ఆలస్యం చెయ్యకుండా మేం యిద్దరం మాయ గదికి పరుగెత్తాం.

అంతవరకూ వెలుగుతున్న గదిలోని పెద్దలైట్ తీసేసి నైట్‌లాంప్ మాత్రం ఉంచాం. ఒంటిమీదున్న చొక్కా, పాంటూ లాగేసుకుని, పైజమాలోకి మారాను.

మాయను మంచానికి అడ్డంగా పడేసి, ఆమెకు చేరువగా కూర్చున్నాను సిద్ధంగా.

గదిబయట మామయ్య పాదాలచప్పుడు వినపడగానే, ఆమెమీదకు వంగాను.

మాయ తమాషాగా మూలుగులు వదల సాగించింది.

అదే సమయంలో మామయ్య గదిలోకి వచ్చాడు మాకు తెలుసు. వస్తూనే పెద్దలైటు స్విచ్ వేసాడు. గదంతా కళ్లు చెదరగొట్టే వెల్తురుతో నిండిపోయింది.

"ఆఁ... ఎవరది?" అంటూ మేం యిద్దరం విడిపోయాం మరుక్షణంలో మామయ్యను చూస్తూనే "అంకుల్! నువ్వా?.. పట్నంవెళ్ళలేదా?" అని మాయ. "మామయ్యా! నువ్వా?.. రేపటివరకూ రావన్నావ్?" అని నేనూ అన్నాం. అంటూనే సిగ్గుతో, భయంతో లేచి బట్టలు సర్దుకున్నట్లు నటించసాగాం.

"ఊఁ... నన్ను అలా పట్నం పోనిచ్చి, మీరుచేస్తున్న నిర్వాకం ఇదన్నమాట?" అన్నాడు మామయ్య గంభీరంగా.

మేం మాట్లాడలేదు. నేలచూపులుచూస్తూ నిలుచున్నాం.

"మాట్లాడరేం?" ఒక్క గసురు గసిరాడు మామయ్య.

ఒక్క క్షణం కంగారుగా, బేజారుగా మామయ్య మొహంలోకి చూసి మళ్ళా తలలు వంచుకొన్నాం.

"ఎన్నాళ్ళనుంచీ సాగుతోందీ వ్యవహారం?" మాయకు చేరువగా పోయి అరిచాడు మామయ్య.

మాయ భయంనటిస్తూ మవునంగా వుండిపోయింది. నాదగ్గరకొచ్చాడు; నా చుబుకం యెత్తి నా కళ్ళల్లోకి చూస్తూ "ఈ సాయంచెయ్యడానికన్నట్రా నువ్వు యిక్కడ కొచ్చిందీ?" అన్నాడు మామయ్య

మామయ్య మెల్లగా మాట్లాడుతున్నా, మా మవునం వల్ల అతని కోపం క్షణక్షణానికి పెలిగిపోతుందని తెలుసుకున్నాను.

"తప్పుచేసాక, పట్టుబడ్డాక యింకా యేం చెప్పమంటావు మామయ్యా?" అన్నాను స్వరం బాగా తగ్గించి, గొణుగుతున్నట్టుగా.

"నోర్ముయ్! చేసింది చాలక యింకా మాట్లాడుతున్నావా?" ఇంటికప్పు విరిగేలా అరిచాడు మామయ్య.

ఆత్మాభిమానం ఉన్న యువకుడిలా పౌరుషం తెచ్చుకుని "మామయ్యా! ఎందుకలా అరుస్తారు? నేను చేసిన తప్పేమిటి?" అన్నాను.

"అబ్బో, అంత తెగించిపోయావుట్రా." అంటూ నా జుత్తుపట్టుకుని చెంపలమీద రెండు కొట్టాడు.

నా కళ్ళు పచ్చగా అయిపోయాయి రెండు క్షణాలు.

తేరుకుని, రెట్టించిన కోపంతో "నన్ను కొట్టడానికి నీకేం హక్కుంది?" అన్నాను అరిచినట్టుగా.

నన్ను కొట్టడానికి మామయ్య మళ్ళా చెయ్యెత్తాడు. అదే క్షణంలో మెరపులా మాయ నా వద్దకు పరుగెత్తు కొచ్చింది. "అంకుల్ ఆయనమీద యింకో దెబ్బ వేసా రంటే మీ మర్యాద దక్కదు," అరిచింది గట్టిగా.

మాయను చూస్తూనే మామయ్య కొయ్యబొమ్మలా నిలిచిపోయాడు, మాటలుడిగిపోయినవాడిలా.

రెండు క్షణాలు పోయాక "అంటే, ఇందులో నీ ప్రమేయం కూడా ఉందన్నమాట?" అడిగాడు మామయ్య మాయను గొణిగినట్టుగా.

"ఇందులో ప్రమేయం ప్రశ్నేముంది? సీతాపతి అంటే నాకు యిష్టం. నా కోరికలు తీర్చే మగతనం అని లో ఉంది. అందుకే అతన్ని నా గదిలోకి ఆహ్వానిం చాను," అంది మాయ.

వింటూనే మామయ్య బాధగా కళ్ళు మూసుకున్నాడు. పిడికిళ్ళు బిగించుకొని మెలితిరిగిపోసాగాడు.

మాయ అనసాగింది.

"డబ్బుకోసం మొగుడు, సెక్సుకోసం ప్రియుడు అనే సిద్ధాంతం అమలుజరిపిన రాజ్యలక్ష్మి కూతుర్ని నేను. నాకు డబ్బుంది మొగుడక్కర్లేదు. నా కోరికలు తీర్చడా నికి ప్రియుడు కావాలి. సీతాపతి నాకు ప్రియుడిగా తగిన వాడు...." అంటూ యింకా యేమేమో అంటుంటే "మాయా! మాయా!" అంటూ గుండెపట్టుకుని నేలమీద పడిపోయాడు మామయ్య.

మేం ఊహించనిది జరిగింది. అతడికి ఉపచారాలు చెయ్యడానికి పరుగెత్తాం యిద్దరం.

ఇక ఆ పథానికి అంతతో స్వస్తిచెప్పాను. ఏమంటే

ఇంకోసారి అలాచేస్తే మామయ్య గుండెఆగి మరణిస్తాదేమో!

6

"చూడు అప్పన్నా! నేనూ, మాయ స్నేహంగా ఉంటే మామయ్య ఎందుకంత మండిపోతున్నాడు?" అడిగాను తోటమాలి అప్పన్నను, అతని గుడిసెకు వెళ్ళి.

"అలా కూసోండి బాబూ!" అంటూ గుడిసెబైట ఓ నులకమంచం వేసాడు అప్పన్న. దానిమీద కూచున్నాను.

"నాకూ అబ్బురంగానేఉంది బాబూ! ఆ బాబు యిలా రాజ్యలక్ష్మిగారిమీదా మండిపోలేదు" అన్నాడు అప్పన్న, నేను కూచున్నాక, క్షణంగడిచిన తర్వాత.

"ఈ యింటికి ఎన్నాళ్ళబట్టి, తోటమాలిగా వుంటున్నావు?"

"ఈ యిల్లు కట్టినప్పటినుంచీనండి"

"అంటే మొదట్నుంచీనన్న మాట.. అయితే దాపరికం లేకుండా చెప్పు. రాజ్యలక్ష్మిగారు, మామయ్యగారు ప్రేమగా వుండేవారా?"

యే యింట్లోనయినా పనివాళ్ళకు తెలియని రహస్యాలుండవు. అందుకే, మామయ్య గత జీవితంగురించి అప్పన్నను అడిగాను.

"ఆ మాట కచ్చితంగా చెప్పలేను బాబూ!... కాని ఒక్కమాట చెప్పగలను కచ్చితంగా.... దెబ్బలాడుకుండేవారు గాదు.... లోలోపల యెలాగుండేవారో గాని" అప్పన్న చెప్పాడు.

"కొత్తతండ్రిని చూసి మాయ యెలా ప్రవర్తించేది?"

"మాయమ్మ యిప్పటిలాగే ఉండేది బాబూ! యెప్పుడూ

చదువూ, ఆటలు, షికార్లు...పిక్నిక్‌లు... కాని మాయమ్మ అంటే మీ మామయ్యగారికి ప్రాణం"

"బహుశా,... తను అంత ప్రాణప్రదంగా చూసుకున్నా ఆమెకు నావల్ల ఎక్కడ ద్రోహం జరుగుతుందో అని.... మామయ్య నామీద మండిపడి ఉంటాడు!" నాకు నేను సమాధానం చెప్పుకున్నట్టుగా అన్నాను.

"అంతే అయ్యుంటాది బాబూ!" తల తాటించాడు అప్పన్న.

"మరి, మామయ్య దేన్నో చూసి ఎందుకలా భయపడిపోతున్నాడంటావ్?" ఇప్పటికి అప్పన్నను అసలు విషయం అడగడానికి అవకాశం దొరికింది.

"తమరు యేమనుకోనంటే ఓమాట చెప్తాను"

"చెప్పు, సందేహించకు" ప్రోత్సహించాను.

"ఇవన్నీ దెయ్యాలు దేవుల్లాడే దిబ్బలు బాబూ!... యే దెయ్యమో, యే కామినీ పిశాచమో, మీ మామయ్య గార్ని పట్టుకొని పీడిస్తోంది బాబూ."

"ఈ మాట మామయ్యతో ఎప్పుడూ చెప్పలేదా?"

"వారు నమ్మరు బాబూ. మునుపోసారి ఈ మాట యింకెవరిగురుంచో అంటే అగ్గిఫైరయిపోయారు నా మీద."

నా మనసులో మాటలు అప్పన్న నోటినుంచి వస్తున్నట్టుగా ఫీలయ్యాను ఆ క్షణంలో. అప్పన్న మాటలు అంతగా నచ్చాయి నాకు.

మామయ్య విచిత్ర ప్రవర్తనకు కారణం, దెయ్యం పట్టడంతప్ప నాకు యింకొకటేదీ సమంజసంగా కనింపించటంలేదు, యెంత ఆలోచించినా.

ఆ సంగతి నేను చూసుకొంటాను గానీ, యీ చుట్టు పట్ల నీకు తెలిసిన భూతవైద్యుడెవడన్నా ఉన్నాడా?... నేను వెళ్ళి అతన్ని కలుసుకోవాలనుకుంటున్నాను." అన్నాను నేను.

రెండు నిముషాలు దీర్ఘంగా ఆలోచించిన మీదట పట్నంలో భూతవైద్యులు చాలామంది బోర్డులు కట్టుకుని ఉన్నారు గాని, వాళ్ళని నమ్మలేం బాబూ...ఇక్కడికి ఆరుమైళ్ళలో ఓ పల్లెటూరు ఉంది...అక్కడ మాంచి వైద్యుడున్నాడు బాబూ నామట్టుకు నేను ఒకర్ని చూసాను...మంత్రం చదివి వేపమండతోటి దెయ్యంపట్టిన వాడి తలమీద ఒక్కటేసాడంటే, దెయ్యం పుంజాలు తెంపుకుని పరుగెత్తాల్సిందే" చెప్పాడు అప్పన్న.

మామయ్య నిజంగా యేపిశాచం చేతిలోనో చిక్కుకుని ఉండాలి. లేకపోతే పట్ట పగలు తన నీడను చూసి తను భయపడిపోయే పిరికివాడయి పోవడమేమిటి?

మామయ్యకు తప్పక భూతవైద్యం చేయించాలి.

"ఆ భూతవైద్యుని పేరేమిటన్నావ్?"

"భద్రిరాజు"

'వూరు పేరేమిటన్నావ్?"

"మెట్టపాలెం, మహా అయితే రెండు క్రోసులుంటుంది. యిక్కడికి......మీరయితే అలా షైరెళ్ళినట్టు వెళ్ళి వచ్చెయ్యొచ్చు.'

'మామయ్యను చూడగానే భూతవైద్యానికి సంబంధించిన కేసవునో, కాదో చెప్పేస్తాడంటావా?"

"ఆ వైద్యుడికి మొగమాటంలేదండి. టకీమని మొహం మీద చెప్పేస్తాడు....అంతే గాదండి... ఆ

బాబుకి యీ కేసు నయంగాదనిపిస్తే...కానీ పుచ్చుకోడు. ఆ మాట ముందే చెప్పేస్తాడండి."

"అంటే నిక్కచ్చయిన మనిషన్నమాట" అంటూ అలాంటి వాళ్ళు కొందరింకా యీ కాలంలో ఉన్నందుకు ఆశ్చర్యం కనబరిచాను.

'ఆ బాబు చాలా మంచివాడు బాబూ" ఈ ప్రాంతాల్లో అలాంటి గొప్ప మనిషి లేడు బాబూ."

అప్పటికి ఓ నిశ్చయానికొచ్చాను. మామయ్యను భద్రిరాజుకు చూపించి, బాగు చెయ్యించాలి!

"వస్తాను అప్పన్నా! మామయ్య జబ్బే నయమయితే మామయ్యతో చెప్పి నీకో మంచి బహుమతి యిప్పిస్తాను. అన్నాను మంచం మీంచిలేచి బయలు దేరుతూ.

'బహుమానం యెందుకు బాబూ! వారి ఉప్పుతిని బ్రతుకుతున్నాం. ఆ మాత్రం సాయం చెయ్యకపోతే ఎలా బాబూ!" అన్నాడు అప్పన్న నా వెనకాలేవస్తూ.

కొంతదూరం అలాగే నా వెనకాలేవచ్చి 'ఉంటాబాబూ' అని చెప్పి వెనక్కి వెళ్ళి పోయాడు.

7

అమర్నాడే భూతవైద్యుడు వద్దకు వెళ్దామనుకున్నాను కాని, మామయ్య యింటివద్దనే ఉండిపోయాడు. అతనితో పాటుగ నేనూ ఉండిపోవాల్సి వచ్చింది.

ముందుగా భూతవైద్యం గురించి మామయ్యతో చెప్పడం నా కిష్టంలేదు.

రెండు తరాల క్రితం యువకుల్లో ఒక రకం భావా లుండేవి. శాస్త్ర పరిశోధనకు అలవికానిది దేన్నీ వాళ్ళు నమ్మేవారుకాదు. మామయ్యలో ఈ నాటికీ ఆ

భావాలున్నాయి. దెయ్యాల ఉనికి సైన్సు నిరూపించ లేదు కాబట్టి, దెయ్యాలన్నవిలేవు అని వాదిస్తాడు, అప్పటి రోజులాగానే.

వైద్యం అంతా అయ్యాక, తాను బాగుపడ్డాక, దెయ్యాల గురించి నమ్మకేం చేస్తాడు? అప్పుడే చెప్తాను అతనితో. అంతవరకూ భూత వైద్యం విషయం రహస్యంగా వుంచడమే మంచిది.

మర్నాడు కూడా మెట్టపాలెం వెళ్ళే వీలు కలగలేదు.

మూడో రోజున మామయ్య ఏదో వ్యవహారం మీద పట్నంలోకి వెళ్ళగానే మాయను వెంటబెట్టుకుని వెళ్ళాను మెట్టపాలెం.

భద్రిరాజు యిల్లు పట్టుకోవడం పెద్ద కష్టంకాలేదు నాకు. భూతవైద్యం చేసే భద్రిరాజు యిల్లు యెక్కడని రోడ్డుమీద ఆడుకునే ఓ కుర్రాడ్ని అడగ్గానే చూపెట్టాడు.

ఒక వెడల్పాటి డబ్బారేకు మీద భూతవైద్యుడు, భద్రిరాజును సంప్రదించి భూత, ప్రేత, పిశాచ, ఢాకినీ, గాలి దెయ్యాల్నుంచి రక్షణ పొందండి అని రాసిఉంది.

భద్రిరాజు సన్నగా నల్లగా సుమారు యెత్తుతో ఉంటాడు. యెర్ర రంగు లుంగీ మీద అదే రంగు కల్లీ చొక్కా వేసుకొన్నాడు. మెడలో రుద్రాక్షమాల. ఓ ఆంజనేయుడి బిళ్ళ అదే తాడుకు యేవేవో తాయెత్తులు కట్టబడి ఉన్నాయి.

నున్నగా సాపుగా దువ్విన అతని నల్లని జుత్తు ఒత్తుగా నూనె రాయడం వల్ల నిగ నిగ మెరుస్తోంది. అది అతని భుజాలను ఒరుసుకుంటూనే వేలాడుతోంది.

ఎరుపు జీరలు గల కళ్ళు, చిన్నగా నవ్వినా బయట

పడే తెల్లని పళ్ళూ అతని ముఖానికి వింత ఆకర్షణ తెచ్చి పెట్టాయి.

"యేం కావాలి బాబూ? ఇలా వచ్చారు?' అడిగాడు భద్రిరాజు నా వంక, మాయవంక ఎగాదిగా చూసి

క్లుప్తంగానేనెందుకొచ్చానో చెప్పాను.

'రండి బాబూ!' అంటూ మమ్మల్ని లోనికి తీసు కెళ్ళాడు. అదొక పెద్దగది. దాన్నిండా రక రకాల దేవుళ్ళ విగ్రహాలు, పటాలు ఉన్నాయి. వాటి మీద ఎర్రని కుంకుమ, గంధం, అక్షింతలు, మస్తుగా చల్లబడి ఉన్నాయి. గన్నేరు పువ్వులు తాజావి, వాడి పోయినవి, ముందురోజువి తీయలేదు కాబోలు విగ్రహాల మీద, పొటోలమీద వేలాడుతున్నాయి.

భద్రిరాజు పోయి నలుచదరంగా ఉన్న ఓ తాటాకు చాపమీద కూర్చున్నాడు. తనకెదురుగా ఉన్న పెద్ద తాటాకు చాపమీద కూర్చోమన్నాడు మమ్మల్ని.

ఓ నిముషం దేవుడ్ని ధ్యానించినట్టు కళ్ళుమూసి తెరచి' చూడండి బాబూ!...మొదట్లో నేను భూతవైద్యం చేసే వాడ్ని కాదు...మిఠాయిచేసి బండిమీద త్రిప్పి అమ్మేవాడ్ని...ఓసారి ఓ సాధూగారు వచ్చారు ఈ ఊరు. రచ్చబండ దగ్గర రావి చెట్టుఉంది చూసారూ. సరిగ్గా అక్కడే కూర్చున్నారు....ఎప్పటిలా రోజు ఉదయం లేచి పట్నంలో మిఠాయి అమ్మకు రావాలని బయలు దేరాను.......

"బిడ్డా! నీ్త్రోవ అదిగాదు. రా చూపిస్తా నీ త్రోవేదో!" అని పిలిచారు సాధుగారు.

సాధూగారి దగ్గరకు వెళ్ళాను ......వారివద్ద ఉప

దేశం పొందాను......వారి భక్తుడనయ్యాను, అని తన కథ అడక్కుండానే చెప్పాడు భద్రిరాజు.

"మా అంకుల్‌కి శత్రువులెవ్వరూ లేరు......అతని మీద ఎవరు ప్రయోగం చేసారంటారు?" అడిగింది మాయ.

చూడమ్మా! మొదట మీ నాన్నగార్ని చూస్తేగాని. అది ప్రయోగమో లేక మామూలుగా యే దయ్యము పట్టడమో చెప్పలేము. అయినప్పటికీ మీ ప్రశ్నకు జవాబు చెప్పగలను .....చాలా మంది యేమనుకుంటా రంటే, యెవరో యెవరిమీదో కక్షగట్టి సాధించ దల్చు కుంటే తప్ప, చెడుపు, చిల్లంగివంటి ప్రయోగాలు జరగ వను కుంటారు. అయితే అది సరికాదు... చేతబడి నేర్చుకొన్నవ్యక్తి యెప్పుడూ యెవరో ఒకరిమీద ప్రయో గిస్తూ ఉండాలి.. ... అలాటప్పుడు చేతబడి చెయ్య డానికి యే విరోధమూ అక్కర్లేదు," చెప్పాడు భద్రి రాజు.

"అయితే మామయ్యగార్ని చూడగానే, ప్రయోగమో, గాలి వాలడమో వెంటనే మీరు చెప్పెయ్యగలరా?" అడి గాను నేను.

తప్పకుండా. భూతవైద్యానికి సంబంధిచని కేసు తీసుకుంటే మా పేరు పోతుంది......అంతేగాదు...... మా గురువుగారికి కోపమొస్తుంది...... అయినా మాకు తీరికేదండీ......ఇప్పటికిప్పుడు ఒక బాలగ్రహ, ఒక కామినీపీడ, ఒక చెడుపుకేసు చేతిలో ఉన్నాయి."

"ఈ సందర్భంలో మీకో విషయం చెప్పాలను కుంటున్నాను. మీరేం అనుకోకపోతే" అన్నాను, అతని

మొహంలోకి నిశితంగాచూసి.

"చెప్పండి: సందేహించకండి" హామీ యిచ్చాడు భద్రిరాజు.

"మా మామయ్యకు దెయ్యాలూ, భూతాలూ అంటే నమ్మకంలేదు......ఎవరు చెప్పినా వినేరకం కూడా కాదు... మహా మొండి: ఆయనకు తెలీకుండా... రహస్యంగా జరగాలి భూతవైద్యం... అంతేగాదు... అందువల్ల వైద్యం పూర్తయేంతవరకూ మీ డబ్బు యివ్వడానికి వీలువడదు." ఆఖరుకు నామనస్సులోని మాట చెప్పేసాను అతనితో.

భద్రిరాజు వెంటనే యే జవాబివ్వలేదు. ఆలోచిస్తూ ఉండి పోయాడు చాలా సేపు.

యేమంటారో చెప్పండి... మామయ్యవద్ద చాలా డబ్బుంది. తనకు జబ్బు నయంకావాలిగాని, రెండుమూడు వేలంటే లక్ష్యపెట్టడు... నయమయ్యాక మిమ్మల్ని మర్చిపోతామేమోనన్న బెంగ పెట్టుకోకండి ... నయా పైసలతో మీసొమ్ము మీకందేలా చూసే పూచీ నాది" అన్నాను అతని మవునాన్ని యిహ భరించలేక.

భద్రిరాజు కళ్ళు అర్ధ నిమీలితాలయ్యాయి ఒక్కసారిగా. అలా రెండు సెకన్లు ఉండి కళ్ళుతెరచి "భగవదేచ్ఛ! అలాగే కానివ్వండి. డబ్బుకాదు మనకు ప్రధానం. మీ మామయ్యగారు నయంగావడం ముఖ్యం," అన్నాడు.

నా సంతోషం చెప్పనలవిగాదు. ట్రీట్‌మెంట్ మొదలు పెట్టకముందే తమ ఫీజు వసూలు చేసుకునే డాక్టర్లున్న ఈ రోజుల్లో, నయంఅయ్యాక, డబ్బివ్వండి అని చెప్పే

నాధుడెవడు? బావుండదని గాని, లేచి అమాతంగా భద్రిరాజు కాళ్ళమీద పడి మొక్కాలనిపించింది.

"మామయ్యగార్ని చూడ్డానికి యెప్పుడొస్తానంటారు?"

"ఇప్పుడు చాలా బిజీగా వున్నానండి. నెల రోజుల వరకూ వీలుగాదేమో!"

"డబ్బు ముందే ఇవ్వలేదని అలా అంటున్నారా?" అన్నాను కాస్త చురుకుగా.

"అబ్బే! అలాగనుకోకండి. అదే నా అభ్యంతరమైతే ముందే చెప్పేసి ఉండేవాడ్ని. నాకు మోమాటాలు లేవు."

"మరయితే వెంటనే వారం రోజులోపున రండి. మామయ్య గార్ని చూడండి. లేకపోతే, మామయ్య పరిస్థితి మరింత విషమించవచ్చు" అన్నాను కాస్త బాధగా.

"అలాగే బాబూ! వస్తాను. నన్ను చూడగానే, ఎందుకొచ్చారు మీరు, ఎవరుమీరు అని, నన్ను మీ మామయ్య గారడిగితే యేంచెప్పాలి?"

"ఈ రంగు బట్టల్లోగాకుండా సాదా బట్టల్లో రండి. నా స్నేహితుడిగా పరిచయం చేస్తాను" అని నేను అనగానే భద్రిరాజు తన అంగీకారం తెల్పాడు.

మెట్టపాలెం వెళ్ళిన పని విజయవంతమైనందుకు, ఆనందంగా తిరుగు ప్రయాణం మొదలు పెట్టాం నేనూ, మాయ.

8

ఆ మర్నాటినుంచే భద్రిరాజు రాకకోసం యెదురు చూడసాగాను.

నేను మనసారా దేవుడ్ని కోరిందేమంటే, మామయ్య

యింట్లో ఉండగానే భద్రిరాజు రావాలని.

వారం రోజుల తర్వాత నేనాశించినట్టుగానే, మామయ్య యింట్లో ఉన్నప్పుడే వచ్చాడు భద్రిరాజు.

గత రాత్రి భయంకరమైన పీడకల వచ్చింది మామయ్యకు. భద్రిరాజు వచ్చేసరికి, మామయ్య ఆ కల షాకునుంచి యింకా కోలుకోలేదు.

అంతకుముందు వారం రోజులుగా, మామయ్యకు అతి చేరువగా మంచం వేసుకొని పడుకుంటూ వచ్చాను. ఎందువల్లనో, అతనికి కనిపించే భీకర దృశ్యాలు గానీ, పీడకలలు గానీ రావటం మానేశాయి.

దాంతో నా పడక, నాకోసం ప్రత్యేకించబడిన గదిలోకి మార్చడం జరిగింది.

రాత్రి పదకొండు కావస్తుండగా, మామయ్య గది నుంచి పిచ్చి అరుపులు పెద్దగా విన్పడ్డాయి.
పరుగున, నేనూ మాయ, మామయ్య గదికి పరుగెత్తాం.

మామయ్య తన మంచంమీద చెమట ఉప్పెనలో తడిసి ముద్దయిపోయి ఉన్నాడు. ఉధృతంగా మలేరియా జ్వరం వచ్చినట్టు, అదే పనిగా వణికి పోతున్నాడు.

తన భ్రాంతి లోకంనుంచి మామయ్యను విడిపించ దానికి మాకు అరగంటకు పైగా పట్టింది. విడుపు లేకుండా నేనొక వైపు, మాయ ఒకవైపు కూచుని పదే పదే అడిగిన మీదట, తనకొచ్చిన కలేమిటో చెప్పాడు మామయ్య.

మామయ్య హాలులో నిలుచున్నాడట. ఆ క్షణంలో ఎవరూ యింట్లోలేరట. ఎవరో స్త్రీమూర్తి తెల్లని బట్టల్లో

వీధి ద్వారంవద్ద అవుపించి "లోనికి రావచ్చాండీ?" అని అడిగింది. ఆవిడ్ని చూస్తూనే మామయ్య గుండెలు భేరీల్లా మ్రోగడం ఆరంభించాయి. రాత్రి పగలూ మామయ్యకు శాంతిలేకుండా చేస్తున్నదావిడే!

"వద్దు! రావద్దు! దయచేసి రావద్దు" అని మామయ్య యెంత మొత్తుకున్నా ఆమె పట్టించుకోలేదు. "నేను రాకపోతే యెలాగండీ?" అని నవ్వుతూ లోనికి వచ్చింది. ఆమె నవ్వుతున్నప్పటికీ, ఆమెతీరు అతని కెందుకో భయం కలిగించింది. దూరంగా వెళ్ళిపోసాగాడు.

"ఎందుకండీ నేనంటే అంత భయం?" అంటూ ఆమె అనునయంగా మాట్లాడుతూ, అతనికి చేరువగా వెళ్ళేసరికి, అతని భయం తగ్గినట్టనిపించింది. మామయ్య దూరంగా వెళ్ళిపోలేదు.

ఆమె అతనికి చేరువగా వచ్చి అతని కళ్ళల్లోకి చూసింది.

ఆ క్షణంవరకూ నవ్వుతున్న ఆమె కళ్ళల్లో ఒక్కసారిగా కోపావేశం! భయంతో ఒక్కడుగు వెనక్కి వేశాడు.

అదే సమయంలో ఆవిడచేతిలో తళతళమని తెల్లగా మెరుస్తూ అర్ధచంద్రాకృతిలో ఉన్న కత్తి అవుపించింది. పిల్లిని చూసిన ఎలకలా మామయ్య పిక్కబలం చూపించాడు. మేడమీదకు పరుగుదీశాడు.

అన్ని మెట్లూయెక్కి అతడు మేడమీదకు చేరుకున్నాడో లేదో అమె అప్పటికే వేటకోసం యెదురుచూస్తున్న బోయవాడులా అతని ఎదురుగా నిలుచుంది.

దడదడ లాడిపోతున్న గుండెలతో తిరిగి దిగువకు

పరుగెత్తబోయాడు. అయితే, యీసారి ఆమెనుంచి, ఆమె చేతిలోని కత్తినుంచి తప్పించుకోలేకపోయాడు.

ఒక్క దెబ్బతో మామయ్య తలతెగి, మెట్లమీదనుంచి బంతిలా కిందికి దొర్లింది.

అంతే! మామయ్యకు భయంతో మెలకువ వచ్చేసింది.

తెల్లవార్లూ మామయ్య నన్ను అంటిపెట్టుకునే ఉన్నాడు. తెల్లవారేక కూడా నేను కాసేపయినా, అతనికి దూరంగా వుండడం సహించలేకపోయాడు.

ఉదయం తొమ్మిదిన్నర అవస్తుండగా వచ్చాడు భద్రిరాజు. కాకీపాంటు, పైన జీరలబుష్షర్టు వేసుకొన్నాడు. నుదుటమాత్రం కుంకుమబొట్టు పెట్టుకోవడం మానలేదు.

ఎవరివో బట్టలు ఎరువుతెచ్చుకుని వేసుకొన్నట్టుగా ఉందిగాని సహజంగా అమరలేదు.

ఈ విచిత్రమైన వ్యక్తి తన స్నేహితుడని చెబితే మామయ్య యేమంటాడో అన్న భయం మనస్సులో ఓ మూల బాధిస్తున్నా, లక్ష్యపెట్టక, "రండి! రండి! ఎన్నాళ్ళయింది మనం కలుసుకుని? ఇన్నాళ్లకా రావడం" అంటూ భద్రిరాజును ఆహ్వానించాను.

తమాషాగా నవ్వి "బోలెడు పనులండీ? వీలుకాలేదు" అంటూ జవాబిచ్చాడు భద్రిరాజు.

మామయ్య హాలులోనే కూచున్నాడు. మాయ యింకా మేడదిగి రాలేదు.

ఆశ్చర్యం నిండిన కళ్ళతో మామయ్య భద్రిరాజు వైపు నిశితంగా చూడ్డం గమనించాను. అయినా పట్టించుకోలేదు నేను.

"మామయ్యా! వీరు భద్రిరాజు గారని గొప్ప నటులు.

ఏదో పౌరాణిక నాటకంలో వేషం వెయ్యడంకోసం గిర జాలు పెంచుకొన్నారు" అన్నాను భద్రిరాజును చూపించి.

కాని, మామయ్య మొహంలో నా మాటలమీద నమ్మకం ప్రస్ఫుటం కాలేదు.

"గజపతిగారని వీరు మా మామయ్య. వ్యాపారం చేస్తున్నారు" అని మామయ్యను పరిచయం చేసాను భద్రిరాజుకు.

ఇద్దరూ పరస్పరం నమస్కరించుకొన్నారు, మొహాల మీద ఇబ్బందిగా చిరునవ్వులు అంటించుకుని.

ఆ తరువాత మామయ్యను దీక్షగా పరిశీలించడంలో పడిపోయాడు భద్రిరాజు.

తనవైపు కోరచూపులు చూస్తున్న భద్రిరాజును చూస్తూ అయిష్టంగా మొహం పెట్టాడు మామయ్య.

పరిచయం చేసిన పుణ్యానికైనా వారు ఒక్కక్షణం మాట్లాడుకోలేదు.

అయిదునిముషాలు బరువుగా గడచాక "వస్తానండీ! నమస్కారం! మళ్ళా కలుద్దాం," అంటూ వెళ్ళిపోవ డానికి లేచాడు భద్రిరాజు.

"ఆయన్ని పంపించేసి వస్తాను మామయ్యా!" అని మామయ్యతో చెప్పి, భద్రిరాజును అనుసరించాను.

మామయ్యగురించి ఆయనేమంటాడో అని ఆసక్తిగా ఉన్నాను. చాలాదూరం పోయాకగాని భద్రిరాజు నోరు విప్పలేదు.

"చాలా కష్టమైన కేసు ఇది. నావల్ల కాదేమోనని అనిపిస్తోంది" అన్నాడు భద్రిరాజు గట్టిగా నిట్టూర్చి.

నేనేం మాట్లాడలేదు. క్షణం పోయాక భద్రిరాజే

మాట్లాడాడు.

"మీ మామయ్యగార్ని పీడిస్తున్నది సామాన్యమైనది కాదు. శాకినీ. దాన్ని వదిలించడం నా శక్తికి మించిన దేమో అని అనుకుంటున్నాను"

నిరాశతో నిండిపోయింది నా మనస్సు ఒక్కసారిగా. భద్రిరాజు తనకు చేతకాదంటే, మామయ్యకు నయమయ్యే దెట్లా ?

"మీకు వీలుకాకపోతే, మామయ్యకు నయం చెయ్య గలిగే భూతవైద్యుడెవరో మీరే చెప్పండి. ఆయన వద్దకు వెళ్తాను" అన్నాను రెండుక్షణాలు ఆలోచించి.

"చూడండి సీతాపతీ! శాకినీ పడితే వదిలించే మొన గాడు యీ ఆంధ్రదేశంలోనే లేడు. కేరళ రాష్ట్రంలో యిద్దరు, ముగ్గురు ఉన్నారు. అందులో ఒకాయనదగ్గర శిష్యరికం చేసాను కాబట్టి ఆ సంగతి కొంత తెలుసు" అన్నాడు భద్రిరాజు శూన్యంలోకి చూస్తూ, విచారంగా మొహం పెట్టి.

"మరి, మీ గురువుగారు శాకినీని లొంగదీసుకునే విద్య చెప్పలేదా ?"

"చెప్పకపోవడమేం ? చెప్పారు. ఈనాటి వరకూ ఆ విద్య ఉపయోగానికి రాలేదు. అదంతా తిరిగి గుర్తు తెచ్చు కుని ప్రయత్నిస్తే, ప్రయోజన ముంటుందా అని ఆలోచి స్తున్నాను?"

అమ్మయ్య! నా నిరాశ ఎగిరిపోయింది ఒక్కదెబ్బతో. భద్రిరాజుకు శాకినీని వదిలించే విద్యవచ్చు. ఎటొచ్చీ, యీనాటి వరకూ దాన్ని వినియోగించక పోవడంవల్ల, ప్రయోజనం వుంటుందా, లేదా అని సంశయిస్తున్నాడు

భద్రిరాజు.

"మరి, ఆలోచించకండి రాజుగారూ! ఎలాగైనా వైద్యం ఆరంభించండి" అన్నాను హుషారుగా.

"నాకూ ఆరంభించాలనే ఉంది బాబూ! ...కాని... కాని" ఆగిపోయాడు సంశయాత్మకంగా భద్రిరాజు.

"సంశయం దేనికి? చెప్పండి" అన్నాను అతన్ని తొందరచేస్తూ.

"చాలా అరుదైనవస్తువులు సంపాయించాలి. ఒరిస్సా నుండి నాకు తెలిసిన కొండవాడి దగ్గరనుంచి తెప్పించాలి. ఇదిగాక, మా గురువుగారు చెప్పిన మంత్రం యీనాడు ఫలించాలంటే రోజుకు వెయ్యినొక్కసారి చొప్పున నెల నెలరోజులపాటు పఠనం చెయ్యాలి" ఆగాడు భద్రిరాజు.

"తెప్పించండి. సందేహం దేనికి?...కష్టమని చెప్పి ఆలోచించకండి...మీ కష్టం వుంచుకోను" అన్నాను.

"బాబూ! నాకివ్వాల్సినదాన్ని గురించి మాట్లాడ్డం లేదు నేను. నా కివ్వాల్సింది మీరు యెప్పుడిచ్చినా ఫరవా లేదు. ఇవ్వకపోయినా, రాజరాజేశ్వరీదేవి దయవల్ల నేను బ్రతగ్గలను. నాకున్న బాధల్లా ఆ కొండవాడికి డబ్బిచ్చి ఒరిస్సానుంచి సామాన్లు యెలాతేవడమా అని?"

"అంటే?" అడిగాను. భద్రిరాజు చెప్తున్నది అర్థం అయీకానట్టుగా ఉంది.

"నాకిప్పుడు కనీసం వెయ్యిరూపాయిలయినా కావాలి" చివరకు చెప్పేసాడు.

"అంత డబ్బు నాదగ్గ రెక్కడిది?...తరువాత యిస్తా నంటే ఆ కొండవాడు మీ స్నేహితుడు గదా. ఒప్పుకో డంటారా?"

"మీరు చాలా అమాయకుల్లా ఉన్నారు బాబూ! నేను యెప్పుడూ సరుకు వాడి దగ్గర్నుంచి తీసుకుంటున్న మాట వాస్తవమే. అయితే వాడు ఒరిస్సావాడు. కొందవాడు. మనం తెలుగువాళ్ళం. యెటువంటి పరిస్థితుల్లోనూ నమ్మడు."

ఎటువంటి క్లిష్టపరిస్థితి యేర్పడిందో నాకు అర్థమైంది. నావద్ద డబ్బులేదు. మామయ్యే నడిగితే యివ్వడు. కాని మామయ్యకు వైద్యం జరగాలి డబ్బులేకపోతే, వైద్యానికి కావాల్సిన వస్తువులు రావు. యేంచెయ్యాలి? నాకేం పాలుపోవడం లేదు.

"ఒక వారం రోజులు గడువివ్వండి. యెలాగో సర్దుతాను" చెప్పాను.

"అలాగేకానీ బాబూ! అయితే అంతకన్నా ఆలస్యం చెయ్యడం తగదు. ఇప్పటికే ఆలస్యం అయిపోయింది. ఆ తరువాత మళయాళ మాంత్రికులు కూడా మీ మామయ్యను బాగుచెయ్యలేరు. మీ శ్రేయోభిలాషిగా యింతకన్నా నేను యింకేమీ చెప్పలేను... వస్తా," అంటూ చక చకా తన వూరువైపు సాగిపోయాడు భద్రిరాజు.

వెళ్తున్న అతనివైపు అలాగే రెండు నిముషాలు చూసి వెనక్కి మరలాను. ప్రత్యక్షమైన దేవుడు వరాలివ్వకుండానే వెళ్ళిపోతున్నట్టని పించింది భద్రిరాజు వెళ్ళిపోతుంటే.

9

ఆ రోజు సాయంకాలమే, బీచికి షికారుకెళ్ళినపుడు అడిగాను మాయను. "వెయ్యి రూపాయలు కావాలంటున్నాడు భద్రిరాజు. యేంచేద్దామంటావ్?" అని.

విగలబడి నవ్వుతూ "ఇవాళ రాత్రి స్టేట్ బేంకున దోపిడీ చేద్దాంపద," అంది మాయ.

ఆమె అలా అనడం మాటకేంగాని, దాంతో నాకో చక్కటి ఆలోచన వచ్చింది. నేనే మామయ్య ఇనప బీరువా నుంచి ఓ వెయ్యి దొంగిలిస్తేనో?... ఒకవేళ పట్టుబడినా, మామయ్య కోసమే చేస్తున్నాను కాబట్టి నన్ను ఆయన అపార్థం చేసుకునే అవకాశంలేదు.

నా కొచ్చిన ఆలోచన మాయకు చెప్పాను.

"నీకు తెలీడం లేదేమో... చిక్కుల్లోపడుతున్నావ్!" అంది మాయ సీరియస్‌గా నా కళ్ళల్లోకి చూసి.

"నేనేదో తనకు సాయంచేస్తానని మామయ్య పిలి చాడు. మామయ్య నాగురించి యేమనుకున్నా, నేను ఎన్ని యిబ్బందుల్లో యిరుక్కున్నా ఫరవాలేదు. మామయ్యకి స్వస్తత చేకూరితేచాలు" నిశ్చయం ధ్వనించిన కంఠంతో అన్నాను.

"ఆ విషయం నాకు తెలుసనుకో. అయినా నీ శ్రేయో లాషిగా, స్నేహితురాలిగా చెప్పాల్సిన బాధ్యత నాకుం ...అందుకే చెప్పాను." అంది మాయ నాచేతిలో చెయి వేసి ఆప్యాయంగా నొక్కుతూ.

ఆవాళ రాత్రే మామయ్య తలగడ క్రిందున్న తాళాలు దొంగిలించి ఇనప్పెట్టెలోంచి వెయ్యిరూపాయలు తీసాను

మర్నాడు సాయంకాలం మామయ్య అలా పట్నంలో వెళ్ళగానే వెయ్యిరూపాయలు భద్రిరాజు చేతిలో పె మామయ్యకు వైద్యం ప్రారంభించ మన్నాను.

"ఇంక మీ మామయ్యగారి గురించి చింతపడకం వారికి నయం అయ్యిందనుకునే నిశ్చింతగా ఉండం

రేపే జగదల్‌పూరు వెళ్ళి మామయ్యగారి వైద్యానికి కావాల్సిన వస్తువులు స్వయంగా తెస్తాను," అన్నాడు భద్రిరాజు, నేనిచ్చిన డబ్బు భద్రపరుస్తూ.

ఆ డబ్బు యిచ్చివచ్చాక, నాకు నిజంగానే నిశ్చింత అనిపించింది

వారంరోజులు గడిచిన తర్వాత భద్రిరాజును కలుసుకున్నాను మెట్టపాలెం వెళ్ళి.

"మీ మామయ్యగారి వైద్యానికి కావాల్సిన సరుకులు తెచ్చాను. అప్పుడే పూజలుకూడా ఆరంభించాను. రోజు రోజుకీ యికముందు మీ మామయ్యగారిలో అవుపించే అభివృద్ధిచూసి మీరే ఆశ్చర్యపోతారు," అంటూ నాచేతిలో చిన్న పాకట్టు ఉంచాడు.

"యేమిటిది?" అడిగాను పాకట్టుని వేళ్ళతో నొక్కి చూస్తూ.

"ఇది చాలా అరుదైన మూలికలతో తయారుచేసిన చూర్ణం. రుచికి తియ్యగానే వుంటుంది. కాఫీలోగాని, పాలల్లోగాని, ఏ పానీయంలోగాని సులువుగా, కలుస్తుంది. రోజుకు చిటికడంటే చిటికెడు రాత్రిపూట మీ మామయ్య గారు సేవించేలా చూడండి" అని చెప్పాడు భద్రిరాజు.

పొట్లంతో యింటికి వచ్చాను. మందు విషయం మాయతో చెప్పాను. రాత్రి మామయ్య కోసం తెచ్చే పాలగ్లాసులో విధిగా కలిపితెమ్మని కూడా చెప్పిఉంచాను.

ఆవాళ రాత్రినుంచి, మామయ్య నిద్రలో చేసే కలవరింతలు, వేసే పిచ్చికేకలు ఆగిపోయాయి.

ఆ కాస్తంత మామయ్య స్థితిలో మెరుగయినందుకు నాకెంతో ఆనందమయింది.

కాని పగలు మాత్రం మామయ్య యెప్పటిలాగానే ఉన్నాడు.

వారం రోజుల తర్వాత మళ్ళా మెట్టపాలెం వెళ్ళి మామయ్యతో కనిపించిన అభివృద్ధి గురించి చెప్పాను భద్రిరాజుతో.

"బాబూ! మీరే చూస్తారుగా. మీ మామయ్యగారి లోంచి కొత్తవ్యక్తి పుట్టుకొస్తాడు. ఎలాగయితేనేం, ఆ శాకినీ నా వశీకరణంలోకి వచ్చింది. త్వరలోనే దానికి ఉద్వాసన చెప్పేస్తాను. రోజూ పూజల్లో అవుపిస్తున్నది నాకు. పిచ్చిముండ! నేనేదో చచ్చుముండా కొడుకు ననుకుంది మొదట. కోరలు చూపించింది. నా గ్రుడ్లు పీకేసి నన్ను గుడ్డివెధవని చేస్తానని బెదరించింది... నేను మహామొండి వెధవని... దానిలాంటి వాళ్ళను యెంత మందిని చూసానో... మూడు రోజులయ్యింది... దాని పద్ధతి మార్చింది. ఇప్పుడు అందమైన ఆడపిల్ల రూపంలో వచ్చి బొల్లి కన్నీళ్ళుకారుస్తూ తనని వదలిపెట్టేయమని వేడుకుంటోంది... నేను తనని వదిలేస్తే... లక్షలుండే నిధి చూపిస్తుందట!... నాకెవరున్నారని లక్షలు? బ్రహ్మచారిని పిడికెడు మెతుకులు ఉడకేసానంటే ఆరోజే గడిచిపోతుంది నాకు," అంటూ ఎన్నో సంగతులు చెప్పాడు భద్రిరాజు.

మామయ్య బాగుపడ్డం విషయంలో భద్రిరాజు తీసుకొంటున్న శ్రద్ధకు, చూపిస్తున్న జాగ్రత్తకు అతనికి కృతజ్ఞతలు చెప్పి నేను యింటికి తిరిగి వెళ్ళిపోబోతుంటే, భద్రిరాజు నన్నాపి నాచేతికో పొట్లాం యిస్తూ "దీంతో మొన్న నేను తీసుకొచ్చిన సరుకులు అయిపోయాయి.

మళ్లా వెళ్ళాలి కొండవాడి దగ్గరికి. ఇంకో వెయ్యి అవసర ముంటుంది," అన్నాడు మెల్లగా.

"ఇంకో వెయ్యా?" మనసులో అనుకోవాల్సిన మాట బయట కనేసాను.

మీరిచ్చే వెయ్యి రూపాయలు తిన్నగా తీసుకెళ్ళి ఆ కొండ వాడి చేతిలోనే పెడుతున్నాను. ఆ డబ్బు ఆ కొండ వాడికి కూడా మిగిలిపోదు. రోజుకి పది రూపాయల కూలిచ్చి మనుషుల్ని కొండల్లోకి పంపి మూలికల కోసం వెదికించాలి. ఒకోక్క రోజున పాతిక ముప్ఫై మైళ్ళు అడివి చుట్టు తిరిగి వచ్చినా, ఒక్క మూలికా దొరకదు. మీ మామయ్యగారికి పాతిక పై చిలుక మూలికల రకాలు కావాలి. ఇప్పుడు చెప్పండి మీ వెయ్యి రూపాయల విలువెంత ఉందో," అని జవాబిచ్చాడు. భద్రిరాజు మృదువుగా.

నేను సిగ్గుతో తలవంచుకొని, మర్నాడు తెచ్చిస్తానని చెప్పి వెనక్కి వచ్చేసాను.

మూడు నెలలు గడిచాయి. మొత్తం అయిదు వేలు తీసుకెళ్ళి భద్రిరాజు చేతిలో పోసాను.

కాని మామయ్య పరిస్థితిలో చెప్పుకోదగ్గ మార్పేమీ కనిపించకపోగా అధ్వాన్నం కాసాగింది. రోజులో యే రెండు మూడు సార్లో అవుపించే దెయ్యం యిప్పుడు తరచుగా అవుపించ నారంభించింది. ఇంచు మించు రోజంతా మామయ్య ఆ షాకుతోనే ఉంటున్నాడు.

మతిపోయిన వాడిలా. ఓ పిచ్చివాడిలా తయారయ్యాడు చివరకు మామయ్య.

మామయ్యకు స్వస్తత కుదరకపోగా, మరింత

చెడుతుంటే నా ఒళ్ళు మండిపోయింది. అడిగేసాను భద్రిరాజును.

నేను సొంతం మాటాడనిచ్చి అన్నాడు భద్రిరాజు శాంతంగా, బాబూ! మీకు మొదటే చెప్పాను. అది శాకినీ అని. నయం అవుతుందోలేదో, నేను చేయ గలనో లేనో అని అప్పుడే అన్నాను. మీరు బలవంతం చెయ్యబట్టి, మీరు మంచివారు కాబట్టి, మీ కేసు తీసు కున్నాను. ఒక్కోసారి నయంగావడానికి, మూడు నాలుగు వేలు మాత్రమే సరిపోవచ్చు. ఇంకోసారి ముప్ఫై వేలన్నా నయంగాకపోవచ్చు. నా వైద్యంలో మీకు నమ్మకం లేకపోతే యీ రోజున ఆపేయవచ్చు. నాకూ హాయిగా ఉంటుంది."

అతను అలా అంటే ఇంకేం అనను. నాకు పిచ్చెక్కి నట్టుయింది. నా కోపాన్ని నాలోనే దిగమింగుకుని వెనక్కి వచ్చేసాను.

భద్రిరాజుతో వైద్యం చేయించడమా, మానడమ అని నాలో నేను తేల్చుకోలేక మధనపడుతుంటే, యింటి వద్ద నుంచి టెలిగ్రాం వచ్చింది నాకు.

అమ్మ చావు బ్రతుకుల్లో ఉంది. వచ్చి చూసి పోవాల్సింది అని నాన్న యిచ్చాడా టెలిగ్రాం.

మామయ్య వైద్యం విషయం తాత్కాలికంగా మరు గున బడింది. మర్నాడే వూరికి ప్రయాణమయ్యాను బస్సులో.

"ఒరేయ్? సీతాపతీ" అంటూ ఎవరో రెండుసార్లు పిలిచారు వెనకనుంచి. ఈవూళ్లో నన్ను "ఒరేయ్" అని పిలిచేవెవరని వెనుదిరిగి చూసాను.

ఆ వ్యక్తిని చూడగానే నా ఆనందానికి అవధులులేవు. అతడు నా ప్రాణస్నేహితుడు ఆనందమూర్తి.

"యేమిత్రోయ్? యేమిటిలా వచ్చావ్" అంటూ వాడున్న సీట్లో ఖాళీవుంటే పోయివాడి ప్రక్కన కూర్చున్నాను.

"ఆఁ... ఇంతకీ నువ్వెక్కడున్నావేమిత్రా ?" అడిగాడు ఆనందమూర్తి.

"నా సంగతి తరువాత ముందు నీసంగతి చెప్పు." అన్నాను.

"అయితేవిను" అంటూ చెప్పనారంభించాడు.

"ఈ మధ్యనే నాకు ఉద్యోగం దొరకడం. పెళ్ళి జరగడం కూడా జరిగాయి"

"అయితే కంగ్రాచ్యులేషన్సు" అన్నాను వాడిచేతిలో చెయ్యి కలిపి.

"థాంక్యూ!... కాని, ఉద్యోగం దొరికిందన్న ఆనందం పెళ్ళి జరగడంవల్ల నాశనమైంది" అన్నాడు విచారంగా.

"అదేం అలాగ?"

"పెళ్ళిఅయిన మూడునెలల్లో మా ఆవిడకు పూనకాల్లాంటివి రాసాగాయి. డాక్టర్లు నరాలబలహీనత అని పేరు పెట్టి డజన్లకొద్దీ ఇంజక్షన్లు యిచ్చారు. కాని లాభంలేక పోయింది. గాలిగుణమేమో అని ఎవరయినా భూతవైద్యుడికి చూపించమన్నారు కొందరు. విచారంగా యిక్కడ పట్నంలో ఎవరో మంచి భూతవైద్యుడున్నాడంటే యిలా వచ్చాను." ఆగాడు ఆనందమూర్తి ఊపిరి పీల్చుకోవడానికి.

"కలిశావా ? యేమన్నాడు''

''నేను వెళ్ళేసరికి అక్కడో చిన్న తమాషా జరుగుతోంది"

"యేమిటది?''

''ఎవరయినా తాము మాట్లాడుకుంటున్నది వింటున్నారన్న సంగతికూడా పట్టించుకోకుండా పోట్లాడుకుంటున్నారు''

''దేనికాపోట్లాట"

"వాటాలుతెగక"

''వాటాలేమిట్రోయ్?'' అడిగాను అబ్బురంగా.

"వాళ్ళ సంభాషణ బట్టి నేను అర్థంచేసుకొన్నది. బాగా డబ్బున్న వాళ్ళ కేసేదో అప్పజెప్పాడు ఆ రెండో వ్యక్తి. తనికు రావాల్సింది ఇమ్మంటున్నాడు ఆవ్యక్తి. ఇవ్వవలసిందేదో మొదటే యిచ్చాను. ప్రతీసారీయివ్వాలని యెక్కడుంది అంటున్నాడు ఆ భూతవైద్యుడు. ప్రతీసారికీ వెయ్యిరూపాయలు అప్పనంగా నీకు వస్తున్నాయంటే నావల్లనేగదా, నాకు వాటా యివ్వడానికి ఎందుకు యేడుస్తున్నావు అని అడుగుతున్నాడు ఆవ్యక్తి. ఆమనిషి నావద్దకు వచ్చేలాచేసావు. అంతవరకే నీ గొప్పతనం. చాతుర్యం. ఆ తరువాత కథంతా నేననడిపాను అంచేత యిహ ముందు కానీయివ్వక్కర్లేదు నేను అని దబాయిస్తున్నాడు భూతవైద్యుడు... దాంతో భూతవైద్యం మీద నమ్మకం చచ్చింది నాకు. మారు మాటాడకుండా వెనక్కి వచ్చేసాను," చెప్పాడు ఆనందమూర్తి.

నేను అవాక్కయి పోయాను.

గుబగుబలాడి పోతున్న గుండెల్ని అదిమి పట్టుకొని

"ఆ భూతవైద్యుడి పేరేమిటో చెప్పగలవా?" అని అడిగాను.

"భద్రిరాజు"

నా గుండాగిపోయింది. అంటే నేను మోసపోయాను. ఒదువేల రూపాయలు మామయ్య దగ్గర్నుంచి దొంగ తనం చేసి అసలు దొంగల చేతుల్లో పోసాను. మామ య్యను బాధిస్తున్న మనోరుగ్మతను ఆధారం చేసుకుని నానుంచి డబ్బు గుంజుకోవడానికి, తోటమాలి అప్పన్న, భూతవైద్యుడు భద్రిరాజు ఆడిన చదరంగంలో పావునై పోయాను.

భద్రిరాజు భూతవైద్యుడు కాడా? యేమో! ఏదో ఒకటి రెండు మంత్రాలునేర్చుకుని, జనాన్ని యేమార్చి డబ్బు గుంజుకుంటున్నాడేమో?

కాలేజీ చదువు వెలగబెట్టిన నేనే అతని మాటలునమ్మి దొంగతనం చేసి మరీ ఐదువేల రూపాయలు అతని చేతిలో పెట్టానంటే, ఇహ, చదువురాని వాళ్ళమాటేమిటి? వాళ్ళని యీ భద్రిరాజు జలగలా పట్టుకుని మరి వదల డేమో?

తలచుకొంటున్నకొద్దీ నా రక్తం మరిగిపోసాగింది. తోటమాలి అప్పన్న, భద్రిరాజు ఆక్షణంలో నాకెదురుగా వుంటే వాళ్ళని ముక్కలు ముక్కలుగా నరికి వుండే వాణ్ని.

"యేమిటిరోయ్, అలాగుండి పోయావేంరా? మాటా పలుకూ లేకుండా" నన్ను కుదిపి అన్నాడు ఆనంద మూర్తి. అప్పటికిగాని, నేను యీ లోకంలోకి రాలేదు.

"నువ్వు చాలా అదృష్టవంతుడివిరా," అన్నాను

మెల్లగా.

"యేంరోయ్ అలాగంటున్నావు?" అడిగాడు ఆనంద మూర్తి.

"భద్రిరాజు మాయల్లో పడకుండా మొదటే తప్పించు కున్నావు"

యేమలా అంటున్నావ్?"

"మా మామయ్య యీ వూళ్ళోనే ఉంటున్నాడు. గత సంవత్సరంనుండిఏదో మనోవ్యాధితో బాధపడు తున్నాడు. ఏదో పీడ పట్టిందనుకుని నేను యీ భద్రి రాజు వద్దకే వెళ్ళాను.

మామయ్యకు శాకినీ పట్టిందని చెప్పి, నావద్దనుంచి ఐదువేల రూపాయలు దోచేసాడు."

"ఐదువేల రూపాయలే?"

"అవును! ఐదువేల రూపాయలే. ఇంకా యిచ్చేద్దును ఇవాళ నిన్ను కలుసుకోక పోయుంటే. నువ్వు వెళ్ళి నపుడు వాళ్ళు మాట్లాడుకుంటున్నది నాగురించే. ఆ రెండోవ్యక్తి మా తోటమాలి అప్పన్న......... చెప్పానునేను. అంతావిని నోట మాటరాక గుడ్లువెళ్ళ బెట్టాడు ఆనందమూర్తి.

భద్రిరాజు ఎంత తెలివిగా నన్ను తన ఉచ్చుల్లోకి లాక్కున్నాడో ఆలోచిస్తూ ఉండి పోయాను, బస్సు ఊరు చేరేంతవరకూ.

10

అమ్మ ఆరోగ్యం మెరుగైంది ఊర్లో వారం రోజు లుండి మళ్ళా విశాఖపట్నం వచ్చాను, మామయ్య యింటికి.

భద్రిరాజును మరి తలవలేదు నేను.

ఎవరో చెప్పారు, మామయ్యను సైకియాట్రిస్ట్‌కు చూపమని.

ఈ సారి మామయ్యకు చెప్పకుండా ఏదీ చెయ్యదల్చుకోలేదు. తనని సైకియాట్రిస్‌కు చూపుతానని మామయ్యతో చెప్పాను. ససేమిరా మామయ్య అంగీకరించలేదు. నాకు ఏమి చేయాలో పాలుపోవడం లేదు.

మామయ్య పరిస్థితి రోజు రోజుకి అధ్వాన్నమై పోతూంది.

ఇప్పుడు మామయ్య మంచం పట్టేసాడు.

ఆ దెయ్యం యిప్పుడు అతనికి ప్రతి క్షణం కళ్ళ ముందు ఉంటోంది.

మేమందరం దగ్గరగా ఉన్నప్పటికీ, ఆ దెయ్యం కనుమరుగవడంలేదు.

ఓ రోజున నేనూ, మాయా తోటలో కూచున్నాం. పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నాం.

అతి ప్రశాంతంగా ఉన్న సాయంకాలపు వాతావరణాన్ని భగ్నంచేస్తూ ఓ చావుకేక విన్పడింది. ఆ కేక మామయ్యది.

కంగారుగా పరుగెత్తాం.

మేం యింట్లోకి వెళ్ళాల్సిన అవసరం లేకపోయింది. తల చిట్లి రక్తపు మడుగులో మామయ్య పడిఉన్నాడు తోటలో నేలమీద.

"మామయ్యా! మామయ్యా!" అంటూ కంగారుగా పోయి, మామయ్యను ఒడిలోకి తీసుకొన్నాను.

మామయ్య కింకా ప్రాణం పోలేదు. కొనఊపిరిఉంది

కళ్ళుతెరచి చూసాడు నావైపు. "యేమైంది మామయ్యా!" అని ఆత్రంగా అడిగాను.

యేమీ జరగలేదన్నట్టుగా తలవూపాడు. "మాయా! వెళ్ళి అంబులెన్స్‌కు ఫోను చెయ్యి!" అన్నాను మాయను చూసి.

మాయ లేవబోతుంటే "వద్దు! వద్దు!" అన్నాడు మామయ్య మెల్లగా. మాయ ఆగిపోయింది.

"నా కివి ఆఖరు క్షణాలు సీతాపతీ: కాయితం తీసుకురా. స్టేట్ మెంట్ రాద్దువుగాని. పోలీసులకివ్వాల్సి వస్తుంది నేను చనిపోయాక," అని అనగానే మాయ పరుగెత్తికెళ్ళి యింట్లోంచి కాయితాలు కలం తెచ్చింది.

మామయ్య చెప్తుంటే రాయసాగాను.

"మనిషికి కోరికలు అనంతం. కోరికలకుందే గుణమేమంటే అవి తీర్చుకుంటూపోతే, యింకా పుట్టుకొస్తాయి. మనిషిగా నాకూ కోరికలుండేవి అందులో తీరనివే యెక్కువ.

మనిషికి కోరికలుండడంలో తప్పులేదు. అవి తీర్చుకోవడంలోనూ తప్పులేదు. కాని వాటికోసం మనం అవలంబించే పద్ధతులే న్యాయసమ్మతంగా ఉండాలి.

నా కోరికలు తీరాలంటే పుష్కళంగా డబ్బు కావాలనుకున్నాను. అది సంపాయించడానికి నేను చెయ్యని వ్యాపారం లేదు. అవలంబించని వృత్తి లేదు. అయినా నేనాశించిన డబ్బు సంపాయించలేకపోయాను.

అదే సమయంలో నాకు రాజ్యలక్ష్మితో పరిచయమైంది ఆమెతో స్నేహం వృద్ధికావడానికి కారణం ఆమె కాదు– మాయ.

మాయను ఎలాగైనా పొందడమే నా జీవిత లక్ష్యమను

కొన్నాను. అయితే యెలా ?

దీర్ఘంగా ఆలోచించినమీదట నాలో చక్కని పథకం తట్టింది. అదే నా నాశనానికి దారితీసింది.

నా పథకం ప్రకారం, ముందుగా ఆమె తల్లిని చేసు కొని, ఆస్తికి హక్కుదారుడ్నవుతాను. ఆ తరువాత ఆమెను చంపేసి మాయను లోబరచుకొంటాను.

రాజ్యలక్ష్మిని చంపడంవరకూ నా పథకం సవ్యంగానే వెళ్ళింది. ఆ తరువాత అంతా తిరకాసయిపోయింది రాజ్య లక్ష్మి దెయ్యమై నన్ను అనుక్షణం వెంటాడసాగింది.

రాజ్యలక్ష్మికి మాయంటే ఎంతో ప్రేమ. ఆమెకు హానికలగడం యేమాత్రం సహించదు. అందుకే చని పోయి కూడా, కూతుర్ని రక్షిస్తూవచ్చింది.

నేను చేసిన ఘోరపాపానికి శిక్షగా నాఅంతట నేనే మేడమీంచి దూకి ఆత్మహత్య చేసుకొన్నాను. ఇందుకు ఎవరూ బాధ్యులు కారు "

నేను రాసిన కాయితంకోసం మామయ్య చెయ్యి చాపాడు. అందించాను. కలం కూడా అందుకుని, వణికే చెయ్యితో సంతకం చేసాడు.

స్టేట్‌మెంట్‌మీద సంతకం చేసిన అయిదు నిముషా లకు మామయ్య కన్నుమూసాడు.

మనస్సుని పుట్టతో పోల్చి, 'మనోవల్మీకం' అని పిలి చారు మన పెద్దలు.

మామయ్య మనస్సులో ఇంత భయంకరమైన ఆలో చనలనే పాములున్నాయని నేనెన్నడూ అనుకోలేదు. అలాగే మామయ్య శవాన్ని చూస్తూండిపోయాను

ఐపోయింది.